ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 30-06- 2026 | సంపుటి: 17, సంచిక: 87, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

రైతు భరోసా నిధులు వారం రోజుల్లో

# జమ చేస్తాం

## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



- ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు.. ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి
- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
-బిజేపీది ఆశకాదు.. అత్యాశ : మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 29 (ప్రజాకలం) :** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రిగారు మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు.

తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయి.

ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు.

తరువాయి 2వ పేజీలో...



ఫ్రాన్స్ తో పర్యాటక, సాంస్కృతిక బంధాల

# బలోపేతానికి కృషి

## తెలంగాణ పర్యాటక రంగాన్ని ఫ్రెంచ్ పర్యాటకులకు చేరువ చేద్దాం

సాంస్కృతిక మార్పిడి ద్వారానే పర్యాటకం, పెట్టుబడులకు ఊతం
మంత్రి జూపల్లిని కలిసిన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ : మంత్రి జూపల్లి
పర్యాటక, వారసత్వ రంగాల్లో సంయుక్త కార్యాచరణకు ప్రతిపాదన

**హైదరాబాద్, జూన్ 29 (ప్రజాకలం) :** తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ–ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పెట్టుబడులు, ప్రజల మధ్య పరస్పర సంబంధాల బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉందని, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతూనే తన సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించుకుంటోందని అన్నారు. తెలంగాణ పర్యాటక విశేషాలను ఫ్రాన్స్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం, ఫ్రెంచ్ ఎంబసీ, పర్యాటక సంస్థలు భాగస్వామ్యం కావాలని ఆహ్వానిం చారు.

తరువాయి 2వ పేజీలో...

## అయోధ్య విరాళాల కేసు..

నిందితులకు 14 రోజుల

# జ్యుడీషియల్ కస్టడీ



- విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం
- జులై 13 వరకు జైలులోనే ఉండనున్న నిందితులు

**అయోధ్య జూన్ 29 :** అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో వారు జులై 13 వరకు జైలులోనే ఉండనున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించడంతో.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయస్థానం. ఈ కేసులో రామశంకర్ అలియాస్ తిన్నూ యాదవ్ సహా అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్‌శంకర్ మిశ్రా, సుభాశ్ శ్రీవాస్తవ్‌లు నిందితులుగా ఉన్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

తరువాయి 2వ పేజీలో...

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

## రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ



**హైదరాబాద్, జూన్ 29 (ప్రజాకలం) :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కారుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




# భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుంది

## త్రైమాసిక, వార్షిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం – ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా



**ఢిల్లీ, జూన్ 29 :** భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుందని ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన త్రైమాసిక, వార్షిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన 20వ జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నప్పటికీ,

తరువాయి 2వ పేజీలో...

# రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు
- రూ.100 కోట్లతో రహదారుల అభివృద్ధికి శ్రీకారం
- సొసైటీ పరిధిలో కొత్త పెట్రోల్ బంక్




**సుల్తానాబాద్,జూన్ 29: (ప్రజాకలం జిల్లాప్రతినిధి)** రైతుల సౌకర్యార్థంవారి ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.సోమవారం సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో సహకార వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్–డీజిల్ పంప్ ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని,నియోజకవర్గంలో వ్యవసాయాధారిత మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు.ఎలిగేడు మండలం శివారులో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం చేపడుతున్నామని,రాబోయే రెండేళ్లలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం వరకు పెంచుతామని వెల్లడించారు.

తరువాయి 2వ పేజీలో...

మత్తు రహిత సమాజ

# నిర్మాణమే లక్ష్యం

## – మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

– జగిత్యాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సంక్షేమ శాఖ మంత్రి, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యే లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



**జగిత్యాల ప్రతినిధి జూన్ 29 (ప్రజా కలం)** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి, నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది" అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల ప్రతి యువకుడు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే

తరువాయి 2వ పేజీలో...

# రైతు భరోసా నిధులు వారం రోజుల్లో జమ చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

కాళేశ్వరం అవినీతి, ధర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు.

ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగింది.

కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్.. తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మూసి నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రిగారు సోమవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ ఢ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హను మంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసి నదిని పునరుజ్జీవింపజేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నది గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టి అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమని వివరించారు.

మూసి నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేసినట్టుగా మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో ప్రజా కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని ఇందుకు అవసరమైన క కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదని మంత్రిగారు స్పష్టం చేశారు.

# ఫ్రాన్స్ తో పర్యాటక, సాంస్కృతిక బంధాల బలోపేతానికి కృషి

మొదటి పేజీ తరువాయి...

ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, పరస్పర పర్యటనలను మరింత విస్తరించాలని సూచించారు. తెలంగాణ-ఫ్రాన్స్ మధ్య ఉన్న సాంస్కృతిక సారూప్యతలు, వారసత్వ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి అవకాశాలను గుర్తించేందుకు సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారానికి బాటలు పడతాయని తెలిపారు. ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ మాట్లాడుతూ పర్యాటకం దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు కీలక రంగమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించే దేశాల్లో ఫ్రాన్స్ ఒకటని, ప్రతి సంవత్సరం 10 కోట్లకు పైగా అంతర్జాతీయ పర్యాటకులు ఫ్రాన్స్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. పర్యాటకం, సంస్కృతి రంగాల అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని చెప్పారు. భారత్-ఫ్రాన్స్ మధ్య రక్షణ, ఔషధ తయారీ, సాంకేతిక రంగాల్లో బలమైన భాగస్వామ్యం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో సుమారు 200 మంది ఫ్రెంచ్ పౌరులు నివసిస్తున్నారని తెలిపారు. తెలంగాణతో పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ రంగాల్లో మరింత సహకారానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ఫ్రెంచ్ పర్యాటకులకు మరింత చేరువ చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

జిల్లా పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు సంకోచించకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని పేర్కొంటూ, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి యువకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేసి సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ వంటి అవగాహన కార్యక్రమాలు యువతలో చైతన్యం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. యువత దేశానికి విలువైన ఆస్తి అని, వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులు, వారి ప్రవర్తన, అలవాట్లపై నిరంతరం దృష్టి ఉంచి వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు "నో" చెప్పి, ఇతరులను కూడా చైతన్యవంతులను చేయాలని, సమాజంలో మత్తు రహిత వాతావరణం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా ఉంచి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందిస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారాన్ని గోప్యంగా అందించిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని పేర్కొంటూ, మత్తు రహిత జగిత్యాల -- మత్తు రహిత తెలంగాణ లక్ష్య సాధనకు ప్రతి పౌరుడు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫాన్సీ, మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

మొదటి పేజీ తరువాయి...

ఇప్పటికే నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(ఎస్ఐటీ).. సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. నిందితులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు అకౌంట్లు, ఆస్తుల వివరాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ కేసులో కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే అనుమానంతో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తక్షణ విచారణకు నిరాకరించింది. ముందుగా పిటిషన్ కాపీని రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది. కాగా.. ప్రస్తుతం ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు యోగి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. మరోవైపు, దోషులపై కఠిన చర్యలు తప్పవన్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం కావాలనే ఈ అంశంపై అనవసర రచ్చ చేస్తున్నారని ఆరోపిస్తోంది.

**'అయోధ్య విరాళాల కేసు నిందితుల తరఫున ఎవరూ వాదించొద్దు'**

అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టైన ఏనిమిది మంది నిందితుల తరఫున తమ సంఘానికి చెందిన ఏ న్యాయవాదీ కోర్టులో వాదించరాదని బార్ అసోసియేషన్ సోమవారం సంచలన తీర్మానం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించే న్యాయవాదులపై రూ.5 లక్షల జరిమానా విధిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా స్పష్టం చేశారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచిన రోజే నిర్వహించిన బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. రామాలయానికి భక్తులు సమర్పించిన కానుకల దుర్వినియోగం ఆరోపణలు.. తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని బార్ అసోసియేషన్ తెలిపింది. అందువల్ల సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. భవిష్యత్తు కార్యాచరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామంది. ఇదే సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ ఇన్‌ఛార్జ్ గోపాల్‌రావుపై కేసు నమోదు చేయాలని కూడా బార్ అసోసియేషన్ తీర్మానించింది. వీరంతా మరో మూడు రోజుల్లో అయోధ్యను వీడాలని, లేనిపక్షంలో నగరమంతా బంద్ చేపట్టి, ఆలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించింది. కాగా.. 2005లో రామ జన్మభూమి తాత్కాలిక ఆలయంపై జరిగిన ఉగ్రదాడి కేసులోనూ నిందితుల తరఫున వాదించబోమని నాడు ఇదే బార్ అసోసియేషన్ ప్రకటించింది.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

మొదటి పేజీ తరువాయి...

అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకున్నారు.

ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం 11 వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు.

తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా రైతు ఆశీర్వాద సభ పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు.

సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలిరావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మొదటి పేజీ తరువాయి...

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే సుల్తానాబాద్ సొసైటీ విత్తన శుద్ధి కేంద్రంగా ఎంపికైందని పేర్కొన్నారు. ఆయన ప్రభుత్వాలు విస్మరించిన మహిళా సంఘాల సేవలను తిరిగి బలోపేతం చేస్తున్నామని, అందులో భాగంగానే గర్రెపల్లి, భూపతిపూర్ శివారులో మహిళల కోసం ప్రత్యేక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. నీరుకుల్లతో పాటు పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ పెట్రోల్ బంక్ ఎంతో ఉపయోగపడుతుందని, గర్రెపల్లి నుండి పెగడపల్లి వరకు రూ.100 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల కోరిక మేరకు మానేరు వాగు ద్వారా త్వరలోనే మంచినీటిని అందించడంతో పాటు, బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, డీసీఓ శ్రీమల, సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# గణాంకాలే సమర్థ పాలనకు పునాది: కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల ప్రతినిధి జూన్ 29 (ప్రజా కలం)

సమర్థవంతమైన పాలన, ప్రజల అవసరాలకు అనుగుణమైన విధానాల రూపకల్పనలో గణాంకాల పాత్ర కీలకమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ గణాంక దినోత్సవం-2026ను ఘనంగా నిర్వహించారు. ఆధునిక గణాంక శాస్త్ర పితామహుడు ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళికాధికారి జి. సత్యం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రణాళికలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో ఖచ్చితమైన గణాంకాలు ఎంతో కీలకమని తెలిపారు. గణాంకాల ఆధారంగా తీసుకునే నిర్ణయాలు సమర్థ పాలనకు, ప్రజల సంక్షేమానికి దోహదపడతాయని అన్నారు. ఈ ఏడాది జాతీయ గణాంక దినోత్సవం థీమ్ "జాతీయ నమూనా సర్వేకు 75 సంవత్సరాలు – నిర్ణయాల కోసం పరిపాలనా డేటా సామర్థ్యాన్ని వెలికితీయడం" నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గణాంక శాఖకు విశిష్ట సేవలందించిన ఎస్‌కెఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. అశోక్, మల్యాల మండల మాజీ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సాంబమూర్తిలను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజా గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వై. ప్రసాద్, గణాంక శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుంది

మొదటి పేజీ తరువాయి...

భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్టమైన రికవరీని సాధించిందని మిశ్రా అన్నారు.

**డేటా ఆధారిత నిర్ణయాలే 'వికసిత్ భారత్'కు పునాది**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం సాక్ష్యాధారాలు, కచ్చితమైన డేటా ఆధారంగానే ఉంటుందని పీకే మిశ్రా వివరించారు. 'మనం సాధించే ప్రగతిని, పథకాల అమలును నిరంతరం కొలవడానికి డేటా ఎంతో అవసరం. 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ డేటా ఆధారిత నిర్ణయాలే దిక్సూచిగా మారనున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం.. ప్రభుత్వ శాఖలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా భారీ మొత్తంలో డేటా అందుబాటులోకి వస్తోందని మిశ్రా చెప్పారు. వివిధ మంత్రిత్వ శాఖల డిజిటల్ కార్యకలాపాల ద్వారా జనరేట్ అవుతున్న డేటాను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం పలు అంశాలపై దృష్టి సారించిందని మిశ్రా తెలిపారు. విభిన్న శాఖల డేటాను ఒకదానితో ఒకటి అనుసంధానించేలా చేయడం, సంప్రదాయ సర్వే డేటాతో ఈ అడ్మినిస్ట్రేటివ్ డేటా సరిపోలేలా నాణ్యతను మెరుగుపరచడం, అధికారిక గణాంకాల పరిధిని విస్తరణ చేస్తూ నమ్మకమైన సమాచారాన్ని అందుబాటులోకి తేవడం వీటి ప్రధాన ఉద్దేశమని మిశ్రా వెల్లడించారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర, మానవ వనరులు**

నిర్ణయాలను మరింత సమగ్రంగా, వేగంగా తీసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత అద్భుతమైన అవకాశాలను కల్పిస్తుందని మిశ్రా అభిప్రాయపడ్డారు. అయితే, అదే సమయంలో సాంకేతికతను సరిగ్గా ఉపయోగించుకునేలా మానవ వనరుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. AI అందించే ఫలితాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకోవడం కూడా అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం

## - నూతన వంతెన, బీటీ రోడ్డును ప్రారంభించిన ప్రభుత్వ విప్



పెద్దపల్లి, జూన్29: (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గంలో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పర్యటించి రూ.14.80 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తపల్లిలో రూ.2.40 కోట్లతో నిర్మించిన హై లెవెల్ వంతెనను మరియు నిట్టూరు నుంచి కాచాపూర్ వరకు రూ.12 కోట్లతో పూర్తి చేసిన నూతన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం పెద్దకల్వల శివాలయంలో రూ.40 లక్షల నిధులతో రాజగోపురం, అర్చకుల నివసిత గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని పేర్కొన్న ఆయన, త్వరలోనే నిట్టూరు-వెంకటరావుపల్లి మధ్య వంతెనను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ను పరామర్శించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు



ఇబ్రహీంపట్నం జూన్ 29 (ప్రజా కలం ప్రతినిధి ) మండలం లోనియామాపూర్ సర్పంచ్ కనక నాగేష్ తండ్రి కనుక హన్మాండ్లు ఇటీవల మృతిచెందగా ఈరోజు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామంలో సర్పంచ్ నగేష్ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో జువ్వడి కృష్ణారావు వెంట ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు వైస్ చైర్మన్ ఎలా ల వెంకట్ రెడ్డి. ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూష రాజేశ్వర్.తిరుపతిరెడ్డి.గంగారెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

**నిత్యం 1200 మందికి ఓపీ సేవలు – సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్**



పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా మెరుగైన చికిత్స అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ,ఆసుపత్రిలో రోజుకు సుమారు1200 మంది వరకు ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో వైద్యులు అత్యుత్తమ సేవలందించారు.ముఖ్యంగా గైనకాలజీ విభాగంలో 9 డెలివరీలు,ఒక ట్యూబెక్టమీ, ఒక సల్పింజెక్టమీ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగా,ఆర్థోపెడిక్ విభాగంలో 6,జనరల్ సర్జరీ విభాగంలో 2,ఆప్తమాలజీ విభాగంలో 3 శస్త్రచికిత్సలను వైద్య బృందం పూర్తి చేసింది.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ సూచించారు.తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి తీసుకోవాలని,బయట దొరికే కలుషిత ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,ముఖ్యంగా పిల్లలు,వృద్ధులు మరియు గర్భిణీలు ప్రత్యేక ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.ఆసుపత్రి సేవలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులున్నా,సూచనలు చేయాలన్నా లేదా ఇతర ఆరోగ్య సమస్యలపై సంప్రదించాలన్నా ప్రజలు నేరుగా ఆసుపత్రిలోని రూమ్ నెం.16లో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తనను కలవవచ్చని డాక్టర్ శ్రీధర్ తెలిపారు.ఫోన్ ద్వారా కూడా ఎప్పుడైనా సంప్రదించవచ్చని,జిల్లా ప్రజలందరూ ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు బుక్కుల పంపిణీ

- 5000 వేల విలువగల వస్తువుల పంపిణీ దాత సిరిపురం కుమారస్వామి
- పడకల్ గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్ చేతుల మీదుగా పంపిణీ



ఎండపల్లి, జూన్ 29 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం పడకల్ గ్రామం ఎంపీపీఎస్ పాఠశాల లో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరి గింది. ఈ పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల సహాయార్థం పాఠశాల లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మామిడి సంతోష్ యొక్క మిత్రుడు సిరిపురం కుమార స్వామి విద్యార్థులకు 5000 వేల విలువ గల నోటుబుక్స్, పలకలు, పెన్సిల్లు, స్కేల్లు, కంపాస్ బాక్సులు, పెన్స్, షార్పెనర్ తదితర సామాగ్రి గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్ చేతుల మీదుగా విద్యార్థుల కు పంపిణి చేయటం జరిగింది. ఈ సందర్భంగా కుమారస్వామి కి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేయటం జరిగింది ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యా యులు సామంతుల రవికుమార్, ఉపసర్పంచ్ విజయ, పంచాయతీ కార్యదర్శి విజయ్, ఉపాధ్యాయులు మామిడి సంతోష్, తిరుమల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య



గొల్లపల్లి జూన్ 29 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన అనవేని లక్ష్మణ్ (55), జీవితం పై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత మూడు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు పక్షవాతంతో సరిగా నడవలేని స్థితిలో ,అనారోగ్య కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై, జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి 11.00 గంటల సమయంలో వారి ఇంటి వెనుక మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడు ధర్మారం తహాసీల్దార్ కార్యాలయంలో అటెండర్గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు అనవేని సాయికుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

# వైభవంగా గంగమ్మ తల్లి జాతర

**- వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చెల్మెడ**

రుద్రంగి, జూన్ 29, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని అచ్చయ్యకుంట ప్రాంతంలో వెలసిన గంగమ్మ జాతర గంగపుత్రుల సంఘాల ఆద్వర్యంలో సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భముగా మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరారు. డప్పుచప్పులు, బైండ్లోల్ల పాటలు, యువకుల నృత్యాలతో గ్రామమంత సందడిగా మారింది. బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి వారి మొక్కులు నెరవేర్చుకున్నారు. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు సంవృద్ధిగా పండాలని ప్రతి యేటా గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితిగా వస్తుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మరియు ప్రజాప్రతినిధులు, గంగపుత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**జాతర మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెల్మెడ**



గంగమ్మ తల్లి బోనాల వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు లు పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వాదం తీసుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.

# ఈర్ల సమ్మయ్యకు జాతీయ స్వర్ణనంది అవార్డు

**- ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునికి దక్కిన అరుదైన గౌరవం**



పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా,కాల్వశ్రీరాంపూర్ మండలం, ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు 2025-26 సంవత్సరానికి గాను జాతీయ స్థాయి స్వర్ణ నంది అవార్డు లభించింది.జూన్ 28న వేద రూరల్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్,వేద ఎన్జీవో,ఎంఎంకె ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కొమురవెల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని,అవార్డును అందుకున్నారు. సామాజిక సేవ,విద్యాభివృద్ధి,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం,యువతను ప్రోత్సహించడం,సమాజ సంక్షేమం కొరకు ఈర్ల సమ్మయ్య చేస్తున్న కృషిని, అతని విశిష్ట సేవలను గుర్తించిన నిర్వాహకులు జాతీయ స్వర్ణ నంది అవార్డు పత్రం,జ్ఞాపిక, పూలమాల,శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈర్ల సమ్మయ్య గత రెండేళ్లుగా ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.పాఠశాలలో రూ.30.25 లక్షలు మంజూరు చేయించి 3 తరగతి గదులను నిర్మించారు.గ్రామంలో డ్రాపవుట్స్ లేకుండా చేసి,పిల్లల సంఖ్యను గణనీయంగా పెంచారు.దాతల సహకారంతో పాఠశాలకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ నుంచి 40 బెంచీలు తెప్పించారు.పిల్లల కోసం రూ.1లక్ష విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్, రూ.40 వేల విలువైన వాటర్ ట్యాంక్, గ్లాస్ బోర్డ్, స్మైల్ ఫౌండేషన్,రెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రూ.8 లక్షల విలువైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్ (స్మార్ట్ టీవీ),సోలార్ ఎలక్ట్రిసిటీ ఏర్పాటు చేయించారు.అతి త్వరలోనే పాఠశాలలో కంప్యూటర్లు,ఏసీలు,ఏర్పాటు చేస్తామని ఈర్ల సమ్మయ్య తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి,పిల్లల చదువులో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు. పిల్లల్ని అద్భుతంగా తయారుచేసి,2024 నుంచి 2026 వరకు వరుసగా రెండుసార్లు జిల్లా బెస్ట్ స్కూల్ అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈర్ల సమ్మయ్య మహాముత్తారం మండలం నాయక్ పోడ్ కాలనీ మొదటి నియామకం కాబడినారు.అప్పుడు పాఠశాల పశువుల పాకలో నడుస్తుండేది.పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ కు ఆయన లేఖ రాసి,స్థానికుల ద్వారా అక్కడ చక్కటి పాఠశాల భవనాన్ని నిర్మింప చేశారు.అక్కడ పిల్లలకు చక్కటి విద్యను అందించారు,ప్రాథమిక పాఠశాలలు శ్రీరాంపూర్లో 7ఏడు,శ్రీరాంపూర్ ఎస్సీ కాలనీలో 13 సంవత్సరాలు పనిచేసి,వాటిని అద్భుతంగా తయారు చేశారు. వేలాది మంది విద్యార్థులు,యువతను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దారు. అంతేకాక తన పాటలు,సాహిత్యం,సామాజిక సేవ ద్వారా సమాజంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ అవి అర్హులైన ప్రజలకు అందేలా చేస్తున్నారు.ఆయన సేవలను గుర్తించిన పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక అవార్డులను అందజేస్తున్నారు.ఈర్ల సమ్మయ్యకు జాతీయస్థాయి స్వర్ణనంది పురస్కారం రావడం పట్ల,అధికారులు, ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు,మిత్రులు శ్రేయోభిలాషులు బంధువులు విద్యార్థినీ,విద్యార్థులు గ్రామస్తులు,మండలం, జిల్లాలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అనేకులు ఆయన సేవలను కొనియాడుతూ అభినందిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం సీపీఐ పోరుబాట

**- జూలై 1న కలెక్టరేట్ల ముట్టడికి చాడ వెంకటరెడ్డి పిలుపు**

పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని,స్థలం లేని వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అందించాలని డిమాండ్ చేస్తూ,జూలై 1న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు ఇస్తామని చెబుతూనే వరంగల్లో గుడిసెలను తొలగించడం దుర్మార్గమని,దీనిపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని నిలదీశారు.కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ఆపలేని అసమర్థత మోదీదని,త్వరలోనే మతోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్షాలు కలిసి పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత



పారదర్శకంగా జరగాలని,బెంగాల్ తరహాలో వ్యవహరిస్తామన్న బీజేపీ నేతల వ్యాఖ్యలు అవివేకమని పేర్కొంటూ,ఒక్క ఓటు కూడా తొలగకుండా అధికారులు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వినతిపత్రంపై స్పందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి మంత్రులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తాండ్ర సదానందం,కడారి సునీల్,మార్కాపూర్ సూర్య,రమేష్,నవీన్,కల్లేపల్లి రవి,జింక విటల్,బాలసాని లెనిన్,రేణిగుంట్ల క్రితం తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



**- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి**

పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన షమిమ్ సుల్తాన తనకు ఇంటి స్థలం కరీంనగర్ లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు కరీంనగర్లో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ పరిశీలించాలని డిఆర్ఓ తెలిపారు.రామగుండం జై భీమ్ నగర్ కు చెందిన గూపాల స్వామి తాను పక్షవాతంతో బాధపడుతున్నానని తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని ఎంబీఏ చదువు పూర్తి చేశానని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన సాన కొమురయ్య అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్న కుటుంబం నుంచి అక్రమంగా దివ్యాంగుల పెన్షన్, వితంతు పెన్షన్ పొందుతున్న వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్,సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# నూకపల్లి లో దారుణం

**- భార్యను హత్య చేసి.. భర్త బలవన్మరణం**



జగిత్యాల ప్రతినిధి జూన్ 29 (ప్రజా కలం) జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. సోమవారం వెలుగులోకి వచ్చిన సంఘటన కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన గోలెపు నాగరాజు అతని భార్య లక్ష్మి (30)ని ఉరివేసి హత్య చేశాడు. అనంతరం నాగరాజు (35) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఉదయం స్థానికులు అందించిన సమాచారం ప్రకారం మల్యాల పిఎస్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని మల్యాల సిఐ, ఎస్ఐలు సందర్శించి శవ పంచనామా అనంతరం మృతదేహాలను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా హత్య, ఆత్మహత్య కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణకే ప్రాధాన్యత

**- మెగా వైద్యశిబిరంలో సర్పంచ్ వేల్పుల రమేష్**



పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తన హయాములో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని నిమ్మనపల్లి గ్రామ సర్పంచ్ వేల్పుల రమేష్ ఉద్ఘాటించారు.సోమవారం సర్పంచ్ కార్యాలయ ఆవరణలో కరింనగర్ సన్ రైజ్ మల్టి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి యాజమాన్యం సౌజన్యంతో మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.శిబిరంలో నిపుణులైన వైద్యులతో పరీక్షలు జరిపి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భవిశ్యత్తులో సైతం మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు.వైద్యశిబిరంలో దాదాపు 200 మంది గ్రామస్థులకు బీపీ,షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు.వైద్య పరీక్షలు చేసిన వారిలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జైసురేష్,కార్డియాలజిస్ట్ కొండపాక కిరణ్ పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




జగిత్యాల ప్రతినిధి జూన్ 29 (ప్రజా కలం) : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ తెలిపారు.

## కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడొద్దు

**- మెట్ పల్లి బీఆర్ఎస్ నేతలు**




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 29 (ప్రజా కలం) అధికార పక్ష నాయకులకు కక్ష సాధింపు రాజకీయాలు సరి కాదని మెట్ పల్లి బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. సోమవారం మెట్పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం 7వ వార్డులో ధ్యావరశెట్టి అరుణ్కుమార్పై పాత కక్షలతోనే కేసులు నమోదు చేయించారని తెలిపారు. డ్రైనేజీ సమస్య విషయంలో వార్డు కౌన్సిలర్ భర్త, చైర్మన్ కుమారులు, వారి అనుచరులు 13వ వార్డు కౌన్సిలర్ను ఉద్దేశపూర్వకంగా వెంట తీసుకెళ్లి అక్కడ గొడవ సృష్టించి, అనంతరం అరుణ్కుమార్పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారన్నారు. ఈ ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఇలాంటి కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని, బాధితులకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ బంగారుకళ్ల కిషోర్, పూదారి సుధాకర్ గౌడ్, ఎండీ జావిద్, ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా కలం
మంగళవారం, జూన్ 30, 2026

# వాషింగ్ మెషిన్ గా మారుతున్న అధికార పక్షం

ఎమర్జెన్సీని ప్రకటించి 51 సంవత్సరాలు గడిచినా, భారతదేశం తన ప్రజాస్వామ్య చరిత్రలోని అత్యంత వివాదాస్పద అధ్యాయాలలో ఒకదానిపై చర్చను కొనసాగిస్తోంది. ఆ చర్చ సమంజసమే కావచ్చు. ఎమర్జెన్సీ పరిశీలన, విమర్శ, చారిత్రక పరిశీలనకు అర్హమైనది. అయితే, ప్రజలు, చరిత్ర రెండూ ఎప్పుడో తీర్పు వెలువరించిన ఒక చారిత్రక సంఘటనగా కాకుండా, భారతీయ జనతా పార్టీ దీనిని ఒక సమకాలీన రాజకీయ సమస్యగా ఎందుకు పరిగణిస్తూనే ఉందనేది అంత సులభంగా అర్థం కాని విషయం. వాస్తవానికి, భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇటీవల వెనకడుగు వేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అప్రకటిత ఎమర్జెన్సీని విధించింది బిజెపియే. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం, మీడియా యాజమాన్యంలోని ఒక పెద్ద విభాగంపై ఉక్కుపిడికిలి బిగించడం, ఆశ్రితపెట్టుబడిదారీ విధానం, సంస్థల గొంతు నొక్కడం, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం – ఇవన్నీ ఎమర్జెన్సీ లక్షణాలు, ఇవి ఇప్పటికీ అమలులో ఉన్నాయి. కాంగ్రెస్ సమకాలీకులలో చాలామంది కూడా, ఎమర్జెన్సీ గురించి లోతుగా పరిశోధించడానికి లేదా చర్చించడానికి తరచుగా ఇబ్బందిపడతారు. ఎమర్జెన్సీ దోషరహితమైనదని కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ వాదించలేదు. దశాబ్దాలుగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌లతో సహా దాని అగ్ర నాయకత్వం, ఆ కాలంలో జరిగిన దురాగతాలను బహిరంగంగా అంగీకరించింది. ఇందిరా గాంధీ స్వయంగా 1977లో ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పును కోరారు. ఓడిపోయినప్పుడు ఓటర్ల తీర్పును అంగీకరించారు. ఆమె స్వయంగా మరో వేయేళ్లు వరకు దేశంలో ఎమర్జెన్సీ విధించే పరిస్థితి రాదనీ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకత్వం చరిత్రలోని ఆ అధ్యాయం పట్ల పదేపదే విచారం వ్యక్తం చేసింది. అయినప్పటికీ, ప్రతి సంవత్సరం, ముఖ్యంగా జూన్ 25వ తేదీ చుట్టూ, బిజెపి ఎమర్జెన్సీని ఒక రాజకీయ ఆయుధంగా పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తుంది. దీని ఉద్దేశం చారిత్రక పరిశీలన కాదు. ఇది ఒక రాజకీయ సమీకరణ. తన వర్తమానంపై విశ్వాసం ఉన్న ప్రభుత్వం, తన పరిపాలన ద్వారా ప్రజల మెప్పు పొందగలమని ఆత్మవిశ్వాసం గల ప్రభుత్వం, దాదాపు అర్థ శతాబ్దం క్రితం ఉనికిలో లేకుండాపోయిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేయవలసిన అవసరం ఉండదు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం మారగానే ఇటీవల కోల్‌కతా అంతటా జరిగిన కూల్చివేతల పరంపర ఎమెర్జెన్సీ నాటి దారుణమైన రోజులను గుర్తుకు తెచ్చింది. సీల్దా, హౌరా, దమ్ దమ్, జాదవ్‌పూర్, ఇతర ప్రాంతాలలో తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, విక్రయదారులు, మురికివాడల నివాసితుల జీవనోపాధిని నాశనం చేసింది. అధికారులు 'అభివృద్ధి', 'సుందరీకరణ' అని పిలిచేది, వాస్తవానికి, శ్రామిక కుటుంబాలు దశాబ్దాలుగా చెమటోడ్చి నిర్మించుకున్న ఇళ్లను, వ్యాపారాలను రాత్రికి రాత్రే కూల్చివేయడమే. మే 16–17 తేదీల రాత్రి, రైల్వే అధికారులు, భద్రతా దళాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సీల్దా స్టేషన్‌లోని కియోస్క్‌లు, స్టాల్స్‌ను కూల్చివేశారు. ఇదే తరహా చర్యలు మే 16న హౌరాలో, మే 31 రాత్రి దమ్ దమ్ జంక్షన్‌లో, జూన్ 7– 8 తేదీల రాత్రి జాదవ్‌పూర్‌లో జరిగాయి. జాదవ్‌పూర్‌లో, వీధి వ్యాపారులు, విద్యార్థులు, కార్మిక సంఘాల కార్యకర్తలు బుల్డోజర్ల ముందు శాంతియుతంగా కూర్చున్నప్పుడు, వారిపై లాఠీచార్జీలు,అరెస్టులు జరిగాయి. వృద్ధ వీధి వ్యాపారులు తమ జీవితపు ఆనవాళ్ల కోసం శిథిలాలలో వెతుక్కోవాల్సి వచ్చింది. కార్మికులకు సంఘీభావం తెలిపినందుకు విద్యార్థులు, కార్యకర్తలను కొట్టారు. ప్రభావిత వర్గాలు చర్చలకు వెళ్ళినప్పుడు, వారిని పట్టించుకోలేదు. వారి డిమాండ్ చాలా సరళమైనది:ఉత్తరప్రదేశ్ నుండి మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్ వరకు, కూల్చివేత చర్యలను పట్టణ ప్రణాళిక సాధనాలుగా కాకుండా, ప్రభుత్వ ఆధిపత్య ప్రదర్శనలుగా ప్రయోగించారు. ఇవి ప్రధానంగా శ్రామిక పేదలు, వలస కార్మికులు, అసంఘటిత కార్మికులను (తరచుగా మైనారిటీలు) లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ప్రతిఘటించడానికి అతి తక్కువ వనరులు, అతి తక్కువ రాజకీయ రక్షణ ఉంటాయి. ప్రయోగించిన ప్రతి బుల్డోజర్‌తో, తాను పనికిరానివారిగా భావించిన వారిపై బలాన్ని ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నానని బిజెపి తన 'బేస్'కు సంకేతం ఇస్తుంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా ఒక వర్గం వారి ఇల్లు లేదా జీవనోపాధి రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకుపోయిన ప్రతిసారీ ప్రజాస్వామ్య జవాబుదారీతనం క్షీణిస్తుంది. గత ఐదేళ్లలో భారతదేశవ్యాప్తంగా కూల్చివేతలు 379% పెరిగాయని పరిశోధనా సంస్థలు నమోదు చేశాయి. నేడు అధికార కేంద్రీకరణ శృతిమించిపోతుంది. ప్రజాస్వామ్యంలో నిరసనలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం కీలకం. అయితే, కీలక నిర్ణయాల విషయంలో సహితం మంత్రివర్గంలో కూడా సవివరంగా చర్చలు ఉండటం లేదు. అధికార పక్షం 'వాషింగ్ మెషిన్'గా మారిపోయింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం కావించడమే కాగలదు. ఎమెర్జెన్సీలో మాదిరిగా న్యాయవ్యవస్థ సైతం నిస్సహాయంగా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతుంది.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




జగిత్యాల ప్రతినిధి జూన్ 29 (ప్రజా కలం)

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 98 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# బైపాస్ రోడ్డు భూసేకరణను అడ్డుకున్న రైతులు



పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దకల్వల నుంచి అప్పన్నపేట వరకు ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన అలైన్‌మెంట్ మార్పు స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు చొరవతో నిధులు మంజూరై ఇప్పటికే శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని కాదని,సోమవారం అధికారులు హఠాత్తుగా వేరే ప్రాంతంలో సర్వే నిర్వహించేందుకు రావడంతో పెద్దకల్వల రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు.తమ భూములను బలిగొని రోడ్డు నిర్మించాలనే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సర్వే అధికారులను రైతులు అడ్డుకున్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు వెనక్కి తగ్గలేదు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రాజీవ్ రహదారిపై ధర్నాకు దిగేందుకు యత్నించారు.తమకున్న తక్కువ భూమిని లాక్కుంటే ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేసిన రైతులు, అన్యాయంగా భూ సేకరణ జరిపి రోడ్డు నిర్మించాలనుకుంటే తమ శవాల మీదుగా వెళ్లాల్సిందేనని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రైతుల నిరసనతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది.రైతులు రాజీవ్ రహదారిపైకి వచ్చి ధర్నా చేసేందుకు యత్నించారు.దీంతో పోలీసులు వారిని అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు.

# బాధిత కుటుంబానికి బీజేపీ అండ.. నిత్యావసర వస్తువుల పంపిణి

**– ఇల్లంద గ్రామంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు**

**– పిల్లల చదువుకు, నెలనెలా బియ్యం అందజేస్తామని హామీ**



జూన్ 29 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన మైదం సంతోష్ (38) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు పరామర్శించి తమ వంతు సహాయాన్ని అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు ఆధ్వర్యంలో నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వన్నాల వెంకట రమణ 50 కిలోల బియ్యం, అడుప రాజు 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే వ్యాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ప్రతి నెలా బియ్యం అందించడంతో పాటు, మృతుడి పిల్లల చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు నాంపెల్లి యాకయ్య, మాజీ మండల ప్రధాన కార్యదర్శి తాల్లపెల్లి కృష్ణమూర్తి, కన్నెబోయిన దుర్గయ్య, మూల రాము, సుంకరి బాబు, సట్ల అనిల్, ఎలిశాల రాకేష్, పాల వెంకటేశం, వేల్పుల కార్తీక్, మల్లెపాక రాకేష్, తాండ్ర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు బానిసలు కాదు బాద్షాలు కావాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**జిల్లాలో బీసీ భవనం కోసం కృషి – బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష**



పెద్దపల్లి,జూన్ 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడి,బీసీలు బానిసలుగా కాకుండా బాద్షాలుగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్లో బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడాలని బీసీ సమాజానికి పిలుపునిచ్చారు.రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉండి,136 కులాల మద్దతు కలిగిన బీసీలు బలహీన వర్గాలు కాదని,వారు ఈ సమాజానికి వెన్నెముక వంటి బలమైన శక్తి అని చెప్పారు.రాబోయే 2028 ఎన్నికలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో 60 మంది బీసీ అభ్యర్థులను గెలిపించుకుని అసెంబ్లీకి పంపడమే బీసీ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.ఓటు అనే పదునైన ఆయుధాన్ని ఉపయోగించి అగ్రకులాల ఆధిపత్యాన్ని ఓడించాలని,తద్వారా రాష్ట్ర పాలనలో బీసీల ముద్ర ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీలిచ్చిన రాజకీయ పార్టీలు ఆ మాట నిలబెట్టుకోలేదని, కేవలం ఓట్ల కోసమే బీసీలను వాడుకుంటున్నాయని మండిపడ్డారు.బీసీలు పాలితులుగా మిగిలిపోవద్దని,పాలకులై తెలంగాణను శాసించాలని శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ఉన్న బీసీ ప్రతినిధులలో సరికొత్త ఉత్తేజాన్ని,పోరాట పటిమను నింపాయి.ఇకనుండి అగ్రకులాలకు ఓటు వేయడాన్ని నిరాకరించాలని,కులాల వారీగా చీలిపోకుండా, ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలతో కలిసి బీసీలు ఐక్యంగా పోరాడితేనే సర్దార్ సర్వాయి పాపన్న ఆశించిన సమసమాజం సాధ్యమవుతుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో ఉన్న వివిధ కుల సంఘాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు,బీసీల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బీసీ భవనం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష స్పష్టం చేశారు.స్థానికంగా నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె ఈ మేరకు కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ జిల్లాలో బీసీ భవన నిర్మాణ ఆవశ్యకతపై ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర మంత్రులతో చర్చిస్తామని,ఈ భవన నిర్మాణానికి గట్టి ప్రయత్నం చేస్తామని ఆమె పేర్కొన్నారు.రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నామని, అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలలో తమ బలాన్ని నిరూపించుకుంటామని ఉష ధీమా వ్యక్తం చేశారు.భవిష్యత్తులో గ్రామ మరియు వార్డు స్థాయి వరకు బలమైన కమిటీలను ఏర్పాటు చేసి,బీసీ వాదాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా ఉద్యమిస్తామని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం పెద్దల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్,బీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్,బీసీ విద్యార్థి జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్,మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్,మాజీ ఫిషరీస్ చైర్మన్ చేతి ధర్మయ్య,బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండ సతీష్,మహిళా కన్వీనర్ సిరవేణి స్వప్న,జిల్లా మహిళా అధ్యక్షురాలు మండే లక్ష్మి,నాగమణి,జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లక్ష్మణ్, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య,పెద్దపల్లి మండల అధ్యక్షుడు కలవేన రవి,ధర్మారం అధ్యక్షుడు చాగంటి కొండయ్య తోపాటు రమేష్,లక్ష్మణ్,బుగ్గ రామస్వామి,కాల్వ రమేష్,పోల్దాసరి సాయికుమార్,సదానందం,అబ్దుల్ మాలిక్,రవీందర్,బీరం రవి,అశోక్,రమేష్,కన్నం శ్రావణ్, అరవింద్,తదితర నాయకులకు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి



ధర్మారం, జూన్ 29 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామం లో పెద్దమ్మ తల్లి బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మారం మండలం నంది మేడారం గ్రామం లో ఘనంగా నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురా రోగ్యాలు, సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాల ని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తుల తో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

# అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గొల్లపల్లి, జూన్ 29 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో ఇటీవల నిర్మించిన నూతన అంగన్వాడి భవనాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నారుల సమగ్ర వికాసానికి, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రతి చిన్నారికి మెరుగైన విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన అంగన్వాడి భవనం ద్వారా గ్రామంలోని చిన్నారులు, మహిళలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మెన్ భీమా సంతోష్, పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న,నిశాంత్ రెడ్డి , సర్పంచులు జలంధర్,కాసరపు భవాని అరవింద్,పురపాటి రాజి రెడ్డి, జెల్ల అనిల్, కాషా గంగాధర్,అంగన్వాడీ సూపర్ జానకి ,జ్యోతి అధికారులు, అంగన్వాడి సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గాజె వేణుగోపాల్

**– కార్యదర్శిగా పాలకుర్తి సదానందం, కోశాధికారిగా కిరణ్ కుమార్ నియామకం**




జూన్ 29 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ ) టీఎన్జీవోస్ యూనియన్ వరంగల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా గాజె వేణుగోపాల్, జిల్లా కార్యదర్శిగా పాలకుర్తి సదానందం, కోశాధికారిగా కిరణ్ కుమార్‌ను నియమించారు. టీఎన్జీవోస్ భవన్‌లో సోమవారం జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్ అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి కేంద్ర సంఘ సహాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ పరిశీలకుడిగా హాజరయ్యారు.

ఈ నెల 30న జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.నూతన అధ్యక్షుడు గాజె వేణుగోపాల్ ప్రస్తుతం పశుసంవర్ధక శాఖలో వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. సంఘంలో 22 ఏళ్లుగా వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శిగా, టీఎన్జీవో వెటర్నరీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, కోశాధికారి, సహాయ కార్యదర్శి తదితర బాధ్యతలు నిర్వర్తించారు.

ఈ సందర్భంగా గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. ముజీబ్ హుస్సేన్, సహాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌తో పాటు సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేస్తూ జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, కోశాధికారి కిరణ్ కుమార్, సిటీ అధ్యక్షుడు శంకేసి రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంశీధర్ బాబు, గద్దల రాజు, రమాదేవి, ఇంద్రాసిన రెడ్డి,రజినీకాంత్, శరత్, రామకృష్ణ, గణేష్, యూసఫ్, శ్రీజ్యోతి, సునీత, పద్మ, కవిత,నాయర్‌తో పాటు వివిధ తాలూకాఅధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నితిన్ నబిన్ సమావేశానికి బయలుదేరిన బిజెపి పార్టీ మండల నాయకులు



( వరంగల్/ పర్వతగిరి) జూన్ 29, ప్రజాకలం ప్రతినిధి. వరంగల్‌లో సోమవారం రోజున నిర్వహించనున్న భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సమావేశానికి పర్వతగిరి మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరారు. పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే జీడబ్ల్యూఎంసీ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు వినోద్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, యువ మోర్చా అధ్యక్షుడు గొల్లపల్లి సంతోష్ కుమార్, బూత్ అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు ఆధ్వర్యంలో కార్యకర్తలు హాజరయ్యారు.

### ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేసి

## పేద విద్యార్థులను ఆదుకోండి

### – ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం

సోమాజిగూడ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల ను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు సర్దార్ సింగ్ విద్యార్థి సంగం నాయకులు సైదులు, శ్రీనివాసులు, రామకృష్ణ, సందీప్, మురళి లతో కలిసి మాట్లాడారు. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు చెల్లించకపోవడంతో ఓవైపు విద్యార్థులతో పాటు లెక్చరర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీఎంబర్స్మెంట్ కాకపోవడంతో సర్టిఫికెట్లు అందక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నోటిఫికేషన్లకు విద్యార్థులు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో రోస్టర్ ఉల్లంఘనలతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా బీసీ విద్యార్థుల పట్ల శాపంగా మారిన క్రిమిలేయర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యా విధానంలో సైతం క్రిమిలేయర్ ను అమలు చేయడం పై మండిపడ్డారు. ఆధునిక యుగంలో సైతం విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న కుల వివక్షపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## గాదరాడలో వైభవంగా మహాకుంబాభిషేక మహోత్సవాలు

కోరుకొండ: కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో వెలసిన “ఓం శివశక్తి పీఠం శంభాల నగరం”లో మహాకుంబాభిషేక, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు వేడుకలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహోత్సవాల్లో భాగంగా, నూతనంగా నిర్మించిన 36 దివ్య ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన పర్వాలు వేద పండితుల మంత్రోచ్చారణలమధ్య ఘనంగా జరిగాయి. హోమగుండాల నుంచి వెలువడుతున్న పవిత్ర ధూపాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం దివ్యలోకాన్ని తలపించింది. శుక్రవారం వినాయక పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఓం శివశక్తి పీఠం సాంప్రదాయ తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, ధూప దీప నైవేద్యాల సమర్పణ నిరంతరాయంగా సాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

## ఏజెన్సీ-మైదానం బోర్డర్ రోడ్డు అధ్వాన్నం

గోకవరం : గోకవరం మండలం గోపాలపురం నుంచి ఇందుకురు పేటకు వెళ్లే ప్రధాన రహదారి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఏజెన్సీకి మైదాన ప్రాంతానికి బోర్డర్‌గా ఉన్న ఈ కీలక రోడ్డు చిన్నపాటి వర్షానికే పూర్తిగా బురదమయంగా మారి, పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయి చెరువును తలపిస్తోంది. ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు రోడ్డు మొత్తం నీటి గుంతలు, బురదతో నిండిపోయింది. ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు, పాదచారులు అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. ఆటోలు, ట్రాక్టర్లు కూడా ఈ గుంతల్లో కూరుకుపోతున్నాయి.
కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం... ఏజెన్సీ-మైదానం బోర్డర్‌లో ఉన్న మా రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి వర్షాకాలంలో ఇదే బాధ. పిల్లలు స్కూల్‌కు వెళ్లాలన్నా, పేషెంట్లను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా ఈ బురదలోనే నడవాలి. కూటమి ప్రభుత్వం వచ్చినా మా రోడ్డు సమస్యను పట్టించుకోవడం లేదు. అధికారులు, నాయకులు వచ్చి చూసి వెళ్లడం తప్ప పరిష్కారం చూపడం లేదు” అని ఇందుకురు పేట గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కుర్మవాడలో రూ.21.50 లక్షల సీసీ రోడ్డు, పైప్ డ్రైన్ పనులకు శంకుస్థాపన

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ 48వ డివిజన్ కుర్మవాడలో రూ.21.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పైప్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నగరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ-అనిల్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి-ప్రకాష్, 47వ డివిజన్ కార్పొరేటర్ గాజ రాము-శివరాం, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

### – సర్పంచ్ మామిడాల లలిత రాజేశం

తాండూర్ : ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజీవ్‌నగర్ గ్రామంలో ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడాల లలిత రాజేశం మాట్లాడుతూ,ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమానికి సహకరించి, సరైన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలి అని అన్నారు. అనంతరం బిఎల్‌ఓ ఎన్. రజిత, బిఎల్‌ఏ సీహెచ్. నరేష్, ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

# ప్రజలకు నిస్వార్థ సేవే లక్ష్యం

### - ఐనవోలుకు నూతన ఎస్సైగా కొంక అశోక్ బాధ్యతల స్వీకారం
### - ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తా
### - శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం
### - యువతను సన్మార్గంలో నడిపేందుకు ప్రత్యేక కృషి

జూన్ 29, ప్రజాకలం ప్రతినిధి: (హన్మకొండ/ఐనవోలు) హన్మకొండ జిల్లా ఐనవోలు పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా కొంక అశోక్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఐనవోలు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నూతన ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ, ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించడమే తన ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. వృత్తి ధర్మాన్ని అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా పనిచేస్తూ, ప్రజలకు భద్రత కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.




ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను అందిస్తానన్నారు. ఆపదలో ఉన్న వారికి సకాలంలో స్పందించి సహాయం చేయడం తన విధిగా భావిస్తున్నానని చెప్పారు. ప్రజలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి తమ సమస్యలను తెలియజేయవచ్చని, ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యువత సమాజానికి ఆదర్శంగా ఎదగాలని, మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు పోలీసు శాఖకు సహకరిస్తే ఐనవోలు మండలంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.
మండల ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ చట్టపాలనకు కట్టుబడి సమర్థవంతమైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని నూతన ఎస్సై కొంక అశోక్ తెలిపారు. దీంతో ఐనవోలు మండలంలో పోలీసింగ్ మరింత ప్రజానుకూలంగా, సమర్థవంతంగా కొనసాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# దౌలత్‌నగర్‌లో భూ కబ్జా ఆరోపణలు

## రైతుకు ప్రాణహాని బెదిరింపులు



( వరంగల్/పర్వతగిరి)జూన్ 29, ప్రజాకలం ప్రతినిధి.
పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన రైతు చీమల అయిలయ్య తనకు వారసత్వంగా వచ్చిన 3 ఎకరాల వ్యవసాయ భూమిని అక్రమంగా ఇతరుల పేరుపై పట్టా చేసి విక్రయించారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన వరంగల్ జిల్లా ప్రజావాణి గ్రీవెన్స్ లో, పర్వతగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైతు అయిలయ్య తెలిపిన వివరాల ప్రకారం, దౌలత్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నెం.419లో ఉన్న 3 ఎకరాల భూమిని గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్నానని పేర్కొన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన చీమల బిక్షపతి తన కుటుంబ సభ్యుల పేర్లను ఉపయోగించి రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమంగా భూమిని ఇతరుల పేరుపై పట్టా చేయించి విక్రయించారని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నించగా తనను దూషించడంతో పాటు భూమి విషయం గురించి మరలా అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని అయిలయ్య వాపోయారు. దీంతో తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
భూ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని, అక్రమంగా జరిగిన పట్టా మార్పిడి, విక్రయాలపై చర్యలు తీసుకోవాలని అయిలయ్య అధికారులను కోరారు. కాగా, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తెలియాల్సి ఉంది. అధికారులు విచారణ చేపట్టిన అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ గా ఎన్. శ్వేత నియామకం

### - సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా సన్‌ప్రీత్ సింగ్ బదిలీ
### - కమిషనర్ బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందా..?
### - అధికార పార్టీ నేతల ఒత్తిళ్లను లెక్క చేయకుండా దూసుకెళ్లిన సన్ ప్రీత్ సింగ్
### - పోలీస్ శాఖలోనూ.. రాజకీయ వర్గాల్లోనూ జోరుగా చర్చ

వరంగల్, జూన్ 29:- (ప్రజాకలంప్రతినిధి)
వరంగల్ నూతన పోలీస్ కమిషనర్‌గా ఎన్ శ్వేత నియామకం అయ్యారు. ఇన్నాళ్లు కమిషనర్ గా విధులు నిర్వహించిన ఐపీఎస్ అధికారి సన్‌ప్రీత్ సింగ్ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో ఎన్. శ్వేతను ప్రభుత్వం నియమించింది. ఐతే ఈ



బదిలీతో పోలీసు వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ పలు చర్చలు సాగుతున్నాయి. సన్‌ప్రీత్ సింగ్ పదవీకాలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన వైఖరి అవలంబించారని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పోలీస్ అధికారులపై కఠిన చర్యలు చేపట్టడంతో సహా పలు కీలక అంశాల్లో రాజీ పడకుండా వ్యవహరించారని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమా, లేక ఇతర కారణాలున్నా యా అనే అంశంపై భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది రాజకీయ నాయకులు, సామాజిక వర్గాల ప్రతినిధులు మాత్రం ఈ బదిలీ వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉండొచ్చనే ప్రచారం జరుగుతోందని అభిప్రాయపడుతున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం లేదా పోలీసు శాఖ నుంచి ఎలాంటి అధికారిక వివరణ వెలువడలేదు. ఇదిలా ఉండగా, కొత్త కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఎన్. శ్వేత నాయకత్వంలో వరంగల్ పోలీసింగ్ మరింత బలోపేతం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుల పక్షపాతికి భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా?

పెద్దపల్లి : రైతుల పక్షపాతిగా చెప్పుకునే ఎమ్మెల్యే విజయ రమణ రావుకు భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా అంటూ బీ ఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మండలంని పెద్దకల్వల గ్రామం వద్ద ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను రైతులు అడ్డుకోవడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. అధికారులు రైతులను సంప్రదించకుండా,ఏకపక్షంగా వ్యవసాయ భూముల్లో మార్కింగ్‌లు వేయడాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తీవ్రంగా ఖండించారు. ఆందోళన చేస్తున్న భూ నిర్వాసిత రైతులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. గతంలో గ్రామ ప్రజాప్రతినిధికి చెందిన స్థలానికి సమీపంగా బైపాస్ రోడ్డు ఉండాలని నిర్ణయించిన ప్పటికీ,తాజాగా ప్రణాళికను మార్చి, చిన్న, సన్నకారు రైతుల సారవంత మైన వ్యవసాయ భూముల మీదుగా రోడ్డును మళ్లించడం వెనుక పెద్ద కుట్ర ఉందని దాసరి ఉష ఆరోపించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, హడావుడిగా ఎర్రజెండాలు పాతడం వెనుక అధికార పార్టీ నేతల స్వార్థం దాగి ఉందని ఆమె మండిప డ్డారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టి,వారి భూములను లాక్కోవాలని చూడటం దుర్మార్గమని,ఒక రైతుకు మూడు ఎకరాల వరకు భూమి పోయే పరిస్థితి ఉంటే, ఆ కుటుంబాలు రోడ్డున పడతాయని, దాదాపు 15 ఎకరాల సారవంతమైన భూమి ఈ సర్వే వల్ల నాశనమవుతోంది. కొందరు బడా వ్యక్తుల అక్రమ కట్టడాలను కాపాడటం కోసమే పేద రైతుల భూములను బలి ఇస్తారా అంటూ ప్రశ్నించారు. భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించకుండా,రైతుల అనుమతి లేకుండా చేసే సర్వేలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి, భూ నిర్వాసిత రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేసిన కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్




మల్హర్, జూన్ 29 ప్రజాకలం ప్రతినిధి : మండల పరిధిలో పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు సిఇఐఆర్ (సిఇఐఆర్) పోర్టల్ సాంకేతికతతో ట్రాక్ చేసి, రికవరీ చేసి బాధితులకు అందజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గత కొన్ని రోజుల క్రితం వల్లంకుంట గ్రామానికి చెందిన, ఏఎంఆర్ కంపెనీ ఉద్యోగి అడుపా సందీప్ తన మొబైల్ ఫోనును వల్లంకుంట పరిసర ప్రాంతాల్లో పోగొట్టుకున్నాడు. అలాగే ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మనోజ్ అనే వ్యక్తి వరి కోత మిషన్ పని నిమిత్తం కొయ్యూరు గ్రామానికి రాగా, కొయ్యూరు – కాటారం మార్గమధ్యంలో తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితులు ఇద్దరూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను ట్రాక్ చేశారు. రికవరీ చేసిన ఆ మొబైల్ ఫోన్లను సోమవారం నాడు బాధితులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మండల పరిధిలో ఎవరైనా తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు ఇచ్చిన వివరాలతో సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను ఈజీగా ట్రాక్ చేసి, తిరిగి అప్పగిస్తామని వారు ప్రజలకు స్పష్టం చేశారు.

## కొండ రాజమ్మ ను ఘనంగా సన్మానించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



మల్హార్, జూన్ 29 ప్రజాకలం ప్రతినిధి :
మలహర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలుగా ఇటీవల ఎన్నికైన కొండ రాజమ్మకు సోమవారం టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు సోమవారం మర్యాదపూర్వకంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. .ఈ సన్మాన కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, మహదేవపూర్ ఎంపీపీ రాణి భాయ్, కాటారం మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, నాయకులు భూపెల్లి రాజు, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

మేడ్చల్ : గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న మేడ్చల్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై మేడ్చల్ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన సచిన్ సంతోష్ జాదవ్ అలియాస్ నితిన్ అలియాస్ ఆకాష్ (24), రాజేష్ మాధవ్ చౌదరి (22)లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 5.849 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధ్రువ కళాశాల రోడ్డు, ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.06 సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి మేడ్చల్‌లో అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరుపరచగా, గంజాయి సరఫరా మూలాలు మరియు ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్‌కు సంబంధించిన ఇతర వ్యక్తుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జ్యువెలరీ షోరూమ్ లో రౌడీల వీరంగం

హైదరాబాద్ : బంజారాహిల్స్ జ్యువెలరీ షోరూమ్లో రౌడీ షీటర్ వీరంగనీ సృష్టించాడు. బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసాడు. పోలీసులు అలీమ్, యూనస్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసారు. రోడ్ నం.10లోని శ్రీ సాయి జగదాంబ పెరల్స్ అండ్ జ్యువెలర్స్ షోరూమ్లో ఘటన జరిగింది. మద్యం మత్తులో వచ్చి మేనేజర్ను బెదిరించారని ఫిర్యాదు. మేనేజర్ ను కత్తితో బెదిరించి లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఫిర్యాదు లో పేర్కోన్నారు. నెక్స్ట్ టైమ్ వచ్చినప్పుడు డబ్బు రెడీ గా ఉంచాలని బెదిరింపులకు గురిచేసారు. తనకు, సిబ్బందికి ప్రాణహాని ఉందని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని మేనేజర్ పంకజ్ బండ్గర్ ఫిర్యాదు చేసాడు. మేనేజర్ ఫిర్యాదుపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసారు. అలీమ్, యూనస్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## డబుల్ ఓటు వద్దు.. సింగిల్ ఓటే ముద్దు

షాద్‌నగర్ : డబుల్ ఓటు వద్దు.. సింగిల్ ఓటే ముద్దు అని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఆయన స్వగృహానికి నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన బీఎల్‌ఓ బుచ్చమ్మ, నోముల వెంకటదాస్, సూపర్వైజర్ ఎన్. పద్మ, బీఎల్‌ఏ శ్రీశైలం తదితరులు వెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా అధికారులు వారిని కలిసి మాట్లాడారు. ఆ తర్వాత షాద్‌నగర్ నియోజకవర్గంలో బతితీ సర్వే ఎలా జరుగుతుందో స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఒకే ఓటు మాత్రమే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు చోట్ల ఓట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ నిబంధనల ప్రకారమేనని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తన ఓటుకు తానే బాధ్యుడని, అనవసరంగా ఒక ఊరిలో ఒక ఓటు, తాను నివసించే మరో ప్రాంతంలో ఇంకో ఓటు నమోదు చేసుకోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉపాధి, జీవనోపాధి కోసం బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది వలస వచ్చి పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తూ జీవిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

# భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జూన్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భారీ వర్షాలు, వరదలు సంభవించినపుడు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో సంభవించే భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నుంచి ముందస్తు జాగ్రత్తల ద్వారా రక్షణ పొందగలుగుతామని అన్నారు. వర్షాకాలం ఎన్డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, వైద్యారోగ్య, ఆర్ అండ్ బి శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉంటుందన్నారు. భారీ వర్షాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని వివరించారు. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు, చెరువుల కింద ఉన్న ప్రజలకు, లోతట్టు ప్రాంతాల ప్రజలందరికీ వాతావరణ వివరాలు, నీటి మట్టపు వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కుంగిన రోడ్లు, గుంతలు, ప్రమాదకర ప్రవాహాలు ఉండే ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి, ఆవైపు ప్రజలెవరూ వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తేముందు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందుగా సమాచారం చేరవేయాలన్నారు. గర్భిణులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి తగిన చికిత్సలకొరకు సంబంధిత ఆసుపత్రుల్లోకి తరలించాలన్నారు. వరద ముంపు ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల ప్రజలను వరదలు వచ్చే అవకాశం ఉన్న సమయానికి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. రోడ్లు కోతకు గురైతే, విద్యుత్ అంతరాయం కలిగితే ఆ సౌకర్యాల పునరుద్ధరణకు ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ముందస్తు రక్షణపై ఎన్డీఆర్ఎఫ్ బృందం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరద సమయంలో ప్రాజెక్టులు, ప్రమాదకర చెరువుల ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బంది బందోబస్తు ద్వారా రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాలకు ప్రజలెవరూ వెళ్లకుండా ఉండేలా పోలీసు శాఖ తరుపున కృషి చేస్తామని వివరించారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవిస్తే రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డిఎస్పీ శ్రీనివాస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రెండో రోజు విజయవంతంగా కొనసాగిన పల్స్ పోలియో కార్యక్రమం

## -మూడవ రోజు కూడా కొనసాగుతుందన్న మండల వైద్యాధికారి గుగులోత్ రవి

మరిపెడ (ప్రజా కలం) న్యూస్ జూన్ 29

రెండవ రోజు కూడా పోలియో నిర్మూలన కార్యక్రమం మండల వ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ గ్రామాల్లో విజయవంతంగా కొనసాగింది అని మరిపెడ మండల వైద్యాధికారి గూగుల్ రవి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పర్యవేక్షణలో వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంటింటికీ వ్యాక్సినేషన్ వేయడం జరిగింది అన్నారు నిన్న మొదటి రోజు వివిధ కారణాల వల్ల పోలియో చుక్కలు వేయించుకోలేక మిగిలిపోయిన ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి, నేడు ప్రతి ఇంటికీ (డోర్ టూ డోర్) వెళ్లి సిబ్బంది పోలియో వ్యాక్సిన్ వేశారు. అన్నారు అదేవిధంగా పల్స్ పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం మూడవరోజు కూడా ఉంటుంది ఇంకా ఎవరైనా మిగిలిపోయిన పిల్లలు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ సౌజన్య, డాక్టర్ వెంకన్న, డాక్టర్ స్వామి, డాక్టర్ కిరణ్ లు పాల్గొని వ్యాక్సినేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. వారితో పాటు పాల్గొన్న సిబ్బంది పబ్లిక్ హెల్త్ నర్స్ (ూఎచీ) మంగమ్మ, సూపర్వైజర్లు ఆచార్యులు, లలిత కుమారి లతో పాటు పల్లె దవాఖాన సిబ్బంది, ూచీవీలు, హెల్త్ అసిస్టెంట్లు మరియు ఆశా కార్యకర్తలు ఈ ఇంటింటి సర్వేలో చురుగ్గా పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యం అంటూ సిసి రోడ్డు పనులు ప్రారంభించిన మరిపెడ పీఎసీఎస్ చైర్మన్ చాపల యాదగిరి రెడ్డి

మరిపెడ (ప్రజా కలం )న్యూస్ జూన్ 29

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పీఎసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి అన్నారు.సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడ్ గ్రామంలో రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్నతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చాపల యాదగిరిరెడ్డి మాట్లాడుతూ..గ్రామాల సమగ్ర అభివృద్ధికి రహదారుల నిర్మాణం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకే వినియోగిస్తున్నట్లు తెలిపారు.సీసీ రోడ్డు పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని,ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అనంతరం గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న మాట్లాడుతూ..గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని,ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుత లేదు స్థానికులు భయాందోళనకు గురికావద్దు

## - ఫారెస్ట్ రేంజ్ ఆధికారి విరేశం

శంషాబాద్ : ఎయిర్ పోర్ట్లోని చిన్మయా స్కూల్ నుండి ఎయిర్ పోర్ట్కు వచ్చే దారిలో చిరుత కనిపించిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు తన సిబ్బందితో కలిసి రేంజ్ ఆధికారి విరేశం పరిశీలించారు. ఎయిర్ పోర్ట్ లోని నర్సరీ మరియూ ఇతర ప్రాంతాల్లో జంతువు అడుగు గుర్తులను పరిశీలించారు. పరిశీలించిన ప్రదేశంలో గుర్తించిన పాద ముద్రలు చిరుత లేదా పులివి కాదని ఆయన తెలిపారు. ఇక్కడ కనిపించిన పాదముద్రలు అడవి పిల్లి లేదా అడవి నక్కవిగా భావిస్తున్నట్లు తెలిపారు. చిరుత సంచరించినట్లు ఎక్కడా అనవాలు లభించలేదని అన్నారు. తాము పరిశీలించిన చోట సిసి కెమారాలు ఏర్పాటు చేసి చూస్తామని తెలిపారు.

# ఎస్ఆర్ఆర్ కళాశాలలో అన్న అక్క ఇంటర్న్షిప్ ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ ముగింపు

కరీంనగర్ : కరీంనగర్లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అన్న అక్క మెంటార్షిప్' టీచింగ్ ఇంటర్న్షిప్ కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజుల పాటు జరిగిన ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ముగిసింది. చివరి రోజు బీఎస్సీ బాటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫిషరీస్, క్రాప్ ప్రొడక్షన్ విద్యార్థులకు శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, శిక్షణ పొందిన ఐదవ సెమిస్టర్ విద్యార్థులు తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్ అంశాలపై మార్గదర్శనం చేయాలని సూచించారు.

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలి:

## - రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.




నిర్మల్ జూన్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాం లు పంపిణీ చేయాలని, ఫాం లు పంపిణీ చేసే అధికారం ఏ ఇతర వ్యక్తులకు లేదని స్పష్టం చేశారు. బిఎల్ఓ లు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని చెప్పారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి 'హెల్ప్ డెస్క్' లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ యాప్ వినియోగించేందుకు అధికారం కేవలం బిఎల్ఓ లకు మాత్రమే ఉందన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫాంలను తిరిగి తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియను మరింత వేగంగా చేపట్టాలన్నారు. ఫాం ల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియలో నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. ఈ వీసీలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బిజ్వారంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు





ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి:

రైతు జీవనానికి ఆశల పండగ, సరికొత్త సాగు ఉత్సాహానికి ప్రత్యేక అయిన ఏరువాక పౌర్ణమి వేడుకలు మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామంలో సోమవారం గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ వై శైలజ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని, నూతన వ్యవసాయ సంవత్సరాన్ని పురస్కరించుకొని గ్రామంలో సాంప్రదాయపద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నుముక, కష్టాన్ని నమ్ముకున్న అన్నదాత ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వం భూమాతను పూజించి, నాగలి పట్టి కొత్త పంటల సాగుకు శ్రీకారం చుట్టే ఈ పవిత్ర పర్వదినాన గ్రామ రైతాంగా సోదరులందరికీ మా ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పాడిపంటలు కళకళలాడాలని, సకాలంలో వర్షాలు కురిసి ప్రతి రైతు ఇల్లు సిరి సంపదలతో నిండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుంది అని పేర్కొన్నారు.

పశువుల పూజ వేడుకలు

ఏరువాక పౌర్ణమి రోజున రైతులకు చేదోడు వాదొడుగా ఉండే పశువులకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎడ్లను చెరువుల వద్దకు తీసుకెళ్లి శుభ్రంగా కడిగి, వాటి కొమ్ములకు రంగులు పూసి, మేడలో గంటలు, అందమైన వస్త్రాలతో ముస్తాబు చేస్తారు.

నాగలిని, కాడిని పూజించి, పశువులకు నైవేద్యంగా కుడుములు, చెలిమిడి బెల్లం వంటివి తినిపిస్తారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ ఎడ్లను గ్రామంలో ఊరేగిస్తూ ఏరువాక సాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చాపల కండ్ల కర్రన్న, గ్రామ పెద్దలు రాగి మాన్ తిమ్మారెడ్డి, కొంకల గోకారన్న, శ్రీనివాస్ గౌడ్, మెకానిక్ గోవిందు, తెలుగు కృష్ణమూర్తి, సుభాన్, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ కి అర్జీ అందజేసిన జనసేన నాయకులు అనంతరం స్పందించి సమస్యలను పరిశీలించిన సంబంధిత అధికారులు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జూన్ 29:

పోలవరం జిల్లా, యటపాక మండలం, శ్రీరాం నగర్ కాలనీ లోని వాటర్ మరియు డ్రైనేజీ సమస్యల గురించి జనసేన నాయకులు పోలవరం కలెక్టర్ కు జూన్ 22న వినతి పత్రం అందించిన వెంటనే సంబంధిత అధికారులు ఆర్ డబ్ల్యూ సీ జే ఈ భాను ప్రకాశ్ సోమవారం శ్రీరామ్ నగర్ కాలనీ గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్వరలోనే వాటర్ ట్యాంక్ ,మరియు డ్రైనేజీ లు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు వివరించండం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రాపోలు కుమార్ స్వామి,గుంజ రాజు, నాయుడు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఏరువాక పౌర్ణమి పండుగ రోజున... రైతులకు మువ్వ గజ్జలు అందచేసిన సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి

ప్రజా కలం గద్వాల ప్రతినిధి:

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో సోమవారం ఏరువాక పండుగ సందర్భంగా సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి రైతన్నలకు మువ్వల గజ్జలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎద్దుల తో ఊరేగింపు చేస్తూ, బసవన్న ల ను అందమైన రంగుల తో ముస్తాబు చేసి గ్రామంలో తిప్పుతూ, రైతన్న ల కు పంటలు పండాలని వర్షాలు మంచిగా కురవాలని కోరారు.ఊరేగింపు లో పాల్గొన్న ప్రతి జతలకు మువ్వల గజ్జలు అందచేశారు. రైతన్న లు ఆనందం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, లక్ష్మి నరసింహ,వార్డు మెంబర్ లు శివ, వెంకటేశ్ ,సవారీ,గ్రామ పెద్దలు శివన్న,ఉల్వ నర్సింలు నాయుడు,ఈశ్వరన,శ్రీశైలం,పాల వెంకటేశ్, కురవ వెంకటేశ్,భీమేష్,మద్దిలేటీ,రంగ స్వామి, ప్రశాంత్,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

## పదివేలు ఆర్థిక సహాయం అందించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మరిపెడ (ప్రజా కలం) న్యూస్ జూన్ 29

మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో గత



కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న సరిత పలువురి గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మరిపెడ మండల కేంద్రంలో బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటాం అధైర్య పడకండి అంటూ ధైర్యం చెప్పి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారూ ఈ కార్యక్రమంలో మాజీ ఒడిసిఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి రామగానీ లింగమూర్తి యాకూబ్ నవాజ్ జానీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# దశదినకర్మకు హాజరై చిత్రపటానికి నివాళులు అర్పించిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావ్ రామడుగు అచ్యుత్ రావు

మరిపెడ (ప్రజా కలం) న్యూస్ జూన్ 29

మరిపెడ మున్సిపాలిటీకి కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత సీనియర్ రాజకీయ నాయకులు దుబ్బాక లక్ష్మారెడ్డి ఇటీవల పరమపదించిన విషయం తెలిసిందే నేడు వంటికొమ్ము లక్ష్మారెడ్డి గార్డెన్స్ లో వారి దశధినకర్మ కు మహబూబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు వారితోపాటు సీనియర్ రాజకీయ నాయకులు రామడుగు అచ్యుత్ రావు హాజరై వారి చిత్రపటం ఎదుట నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతినీ తెలియజేశారు



# ఇంటెన్సివ్ రివిజన్ పై బూత్ లెవెల్ ఏజెంట్ ల అవగాహన కార్యక్రమం. పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు




నిర్మల్ జూన్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యా గార్డెన్స్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై బూత్ లెవెల్ ఏజెంట్ లకు అవగాహన కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న పార్టీ శ్రేణుల కోసం అవసరమైతే తన గళం కూడా వినిపిస్తానని అన్నారు కొందరు అధికారుల తీరుపై పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, దీనిపై పరిపాలన పరమైన అంశాలను క్యాబినెట్ సమావేశంలో ప్రస్తావిస్తానని భరోసా ఇచ్చారు. ఎవరు కూడా నిరాశ నిస్పృహాలకు గురి కావద్దని సూచించారు సమిష్టిగా కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతం చేయడానికి పని చేయాలని హితవు పలికారు బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పేరుతో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయో దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల ప్రక్షాళన అంటూ రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్ర బీజేపీ సర్కార్ ప్రయత్నాలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి పాటుపడాలని ఉద్బోధించారు. ఈ నెల రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్స్ అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలని కోరారు. అర్హులైన ఓటు తొలగింపుతో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై క్షేత్ర స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.



# ఐదు పంచాయతీల విలీనం ప్రభుత్వ ప్రపోజల్లో ఉంది

## -జిల్లా అదనపు కలెక్టర్ స్పష్టత
## -ఐదు పంచాయతీలపై ఇచ్చిన మెమోరాండానికి స్పందన
## -ప్రజా సంఘాల జేపీసీ ఐదు పంచాయతీల పై నివేదిక అందజేత.
## -సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అదనపు కలెక్టర్





ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం ,జూన్ 29:

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆంధ్ర తెలంగాణ విభజన అనంతరం భద్రాచలం భూభాగం పూర్తిగా నష్టపోయిందని ప్రజాసంఘాల జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్కు విన్నవించారు. జిల్లా అదనపు కలెక్టర్ మెమోరాండం తీసుకుంటూ ఈ విషయం ప్రభుత్వ ప్రపోజల్ లో ఉందని ఐదు పంచాయతీల సమస్యను ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రజాసంఘాల జేఏసీ నాయకత్వం పత్రికా ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం పట్టణం వరకే తెలంగాణలో ఉందని రాములవారు భూములు వేల ఎకరాలు ఆంధ్రాలో ఉండటం వలన పుణ్యక్షేత్రం అభివృద్ధికి నోచుకోవట్లేదని వారు వివరించారు. ఉష్ణ గుండాల ఎటపాక జటవాయు వంటి సందర్శనార్థమైన ముఖ్య కేంద్రాలు కనుమరుగయ్యాయని వారు ఆవేదన చెందారు. భద్రాచలం భూభాగం ఆంధ్ర లో కలవడం వలన పరిపాలన విభాగం మొత్తం అస్తవ్యస్తంగా తయారైందని భద్రాచలం కేంద్రంగా ఉండాల్సిన ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు కొత్తగూడెం పాలవంచ వంటి ప్రాంతాలకు తరలి వెళ్లాయని వారు వెల్లడించారు. ఈ ఐదు పంచాయతీల ప్రజలు పరిపాలన పరంగా సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని ప్రక్కనే భద్రాచలం పట్టణం ఉన్న అన్ని సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నప్పటికీ ఆంధ్ర అవటం వలన అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటున్నారని వారు తెలిపారు. ఉద్యోగాలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు నిరుద్యోగులకు సామాన్య ప్రజానీకానికి పరిపాలన సౌలభ్యం లేకపోవటం వలన ఈ ప్రాంత ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. భద్రాచలం ఈ ఐదు పంచాయతీలతో విలీనం అవటం వలన ఈ ప్రాంతం భౌగోళికంగా అభివృద్ధి చెందుతుందని అనేక ప్రభుత్వ కార్యాలయాలు అభివృద్ధి సంస్థలు ఇక్కడే ఉండటం వలన ప్రజలకి సౌకర్యవంతంగా ఉంటుందని వారు అన్నారు. అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించాలని , నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులు సమస్యను పరిష్కరించాలని అలాగే నిరుపేద విద్యార్థులు స్కాలర్షిప్ల లేక చదువుకు దూరం అవుతున్నారని ప్రభుత్వం పెండింగ్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని తదితర సమస్యల పైన జిల్లా కలెక్టర్కు తెలియజేస్తామని వారు అన్నారు. ప్రతి సమస్య పైన సానుకూలంగా స్పందించారని జిల్లా అదనపు కలెక్టర్ ఐదు పంచాయతీల సమస్య ప్రభుత్వ ప్రపోజల్ ఉందని ఆ సమస్య పైన ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని ప్రజా సంఘాల జేపీసీ నాయకత్వానికి తెలిపారు సమస్యల పైన స్పందించిన కలెక్టర్ అలాగే అదనపు కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఏరువాక పౌర్ణమి వేడుకల్లో సుంకులమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి:
ఏరువాక పౌర్ణమి సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ సుంకులమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. గద్వాల పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కుబడులను చెల్లించుకుంటూ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించగా, ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సుంకులమ్మ అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వాతావరణం భక్తులకు కనువిందు చేశాయి. ఆలయ ప్రాంగణం ఉదయం నుంచే భక్తజన సందోహంతో కళకళలాడగా, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణ ప్రజలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తమ కుటుంబాల సుఖశాంతులు, పంటల సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు గద్వాల ప్రాంతంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపగా, సుంకులమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది.

# రోస్టర్ విధానం వల్ల మాల, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలి

## -ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు మాలమహానాడు నాయకుల వినతి...

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం టౌన్ జూన్, 29

రోస్టర్ విధానం వల్ల మాల, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరుతూ మాలమహానాడు నాయకులు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రోస్టర్ విధానం కారణంగా మాల, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎస్సీ వర్గీకరణ అమలు నేపథ్యంలో మాలలకు కలుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించి న్యాయం చేయాలని కోరుతూ ఈరోజు మాలమహానాడు నాయకులు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుత రోస్టర్ విధానం అమలుతో మాల, మాల ఉపకులాలకు ఉద్యోగాలు, పదోన్నతులు మరియు ఇతర అవకాశాలలో తీవ్ర నష్టం జరుగుతోందని వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఇంచార్జ్ దామాల సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌలరాజ్, కార్యదర్శి భయ్యన వీరబాబు, వరద సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామపంచాయతీ, ఆది కర్మయోగి పథకం,

## ద్వారా గుర్తించిన గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే శిరీష, భాస్కర్ కి వినతి పత్రం అందజేసిన తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల ప్రధాన కార్యదర్శిలికణితి. మధు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జూన్ 29:




ఎటపాక మండల పరిధిలో నీ పలు గ్రామపంచాయతీలలో ఉన్న గ్రామాలను ఆదర్శ గ్రామపంచాయతీ పథకం కింద మరియు ఆది కర్మయోగి పథకం కింద గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా గుర్తించిన గ్రామాలలో యుద్ధప్రాది పదికన, డెవలప్మెంట్ పనులను ప్రారంభించాలని సోమవారం రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించడం జరిగిందని కనితి మధు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామాల అభివృద్ధి కొరకు ఆదర్శ గ్రామపంచాయతీ పనులు మరియు ఆది కర్మయోగి పథకం కింద పనులను ఆయా గ్రామాల అభివృద్ధికి తోడ్పడే విధంగా అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చేస్తానని తెలియజేశారు.

# భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి: - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జూన్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భారీ వర్షాలు, వరదలు సంభవించినపుడు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో సంభవించే భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నుంచి ముందస్తు జాగ్రత్తల ద్వారా రక్షణ పొందగలుగుతామని అన్నారు. వర్షాకాలం ఎన్డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, వైద్యారోగ్య, ఆర్ అండ్ బి శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉంటుందన్నారు. భారీ వర్షాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని వివరించారు. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు, చెరువుల కింద ఉన్న ప్రజలకు, లోతట్టు ప్రాంతాల ప్రజలందరికీ వాతావరణ వివరాలు, నీటి మట్టపు వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కుంగిన రోడ్లు, గుంతలు, ప్రమాదకర ప్రవాహాలు ఉండే ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి, ఆవైపు ప్రజలెవరూ వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తేముందు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందుగా సమాచారం చేరవేయాలన్నారు. గర్భిణులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి తగిన చికిత్సలకొరకు సంబంధిత ఆసుపత్రుల్లోకి తరలించాలన్నారు. వరద ముంపు ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల ప్రజలను వరదలు వచ్చే అవకాశం ఉన్న సమయానికి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. రోడ్లు కోతకు గురైతే, విద్యుత్ అంతరాయం కలిగితే ఆ సౌకర్యాల పునరుద్ధరణకు ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ముందస్తు రక్షణపై ఎన్డీఆర్ఎఫ్ బృందం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరద సమయంలో ప్రాజెక్టులు, ప్రమాదకర చెరువుల ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బంది బందోబస్తు ద్వారా రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాలకు ప్రజలెవరూ వెళ్లకుండా ఉండేలా పోలీసు శాఖ తరుపున కృషి చేస్తామని వివరించారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవిస్తే రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డిఎస్పీ శ్రీనివాస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి:

## -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జూన్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుస్తాం

## -టి.జే.ఎస్.అధ్యక్షులు,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం .

నిర్మల్ జూన్ 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుస్తాం అని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. పట్టణంలోని టీఎన్జీవో భవన్లో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. కోదండరాం అధ్యక్షతన తెలంగాణ జన సమితి పార్టీలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో పలువురు చేరారు. అనంతరం జిల్లా అధ్యక్షునిగా వాజిద్ అహ్మద్ ఖాన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నేతలు కంతి మోహన్ రెడ్డి,సర్దార్ వినోద్ కుమార్,తిలక్ రావు, చింత కుంట శంకర్, మల్లయ్య,కంతి రమేష్,అలీమ్ ఖాన్,భోజన్న టి.జే.ఎ.సి. చైర్మెన్ అరెపల్లి విజయ్ కుమార్,శ్రీనివాస రాజు,నాగారం, లక్ష్మణ్,రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# గణితశాస్త్రంలో నరేందర్ సత్వాయికి పీహెచ్.డీ.

పటాన్ చేరు జూన్ 29 (ప్రజా కలం) ప్రతినిధి

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి నరేందర్ సత్వాయి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'పారగమ్య సంకుచిత నాళికలలో నాన్-న్యూటోనియన్ ద్రవ ప్రవాహాల గణిత పరిశీలన'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె. మారుతీ ప్రసాద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు ఈ డాక్టరల్ పరిశోధన, సంకుచిత ధమనులలో రక్త ప్రవాహ గతి శాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి, హృదయ సంబంధ వ్యాధులపై వాటి ప్రభావాలను తెలుసుకోవడానికి గణిత నమూనాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడుతుందని తెలియజేశారు ఈ పరిశోధన వివిధ నాన్-న్యూటోనియన్ ద్రవ నమూనాలను పరిశీలిస్తుందని, రక్త ప్రవాహ లక్షణాలపై ధమని పారగమ్యత, అయస్కాంత క్షేత్రాలు, ఉష్ణ వికిరణం, నాళ స్థితిస్థాపకత వంటి కారకాల ప్రభావాన్ని విశ్లేషిస్తుందని వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాల ఆధారంగా హృదయ సంబంధ వ్యాధులపై మెరుగైన అవగాహన కలుగుతుందని, రోగ నిర్ధారణ విశ్లేషణ, చికిత్స ప్రణాళిక, బయోమెడికల్ పరికరాల అభివృద్ధికి విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని వివరించారు డాక్టర్ నరేందర్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

## - బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి:

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్,మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

పెండింగ్ ప్రాజెక్టులపై గద్వాల నియోజకవర్గంలో ర్యాలంపాడు,గట్టు ఎత్తిపోతల పథకం, నెట్టంపాడు ప్రాజెక్టు లు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులు కానీ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక,ప్రాజెక్టులపై ఉన్న మిగతా పెండింగ్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొన్న గద్వాల పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితిపై ఎందుకు సమాధానం చెప్పలేదని మండిపడ్డారు..కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చిన్న కాలువలో చెట్ల వెలిసిన తొలగించని స్థితిలో ప్రభుత్వము ఉన్నదని విమర్శించారు..గద్వాల ప్రజల సాగు,తాగునీటి అవసరాలకు కీలకమైన ప్రాజెక్టుల పనులు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని,వాటి పూర్తి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్య వ్యవస్థ పై....

తెలంగాణ గురుకుల పాఠశాలల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న కుంభకోణాలపై బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ పోరాటం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం విద్యార్థులకు న్యాయం జరగాలన్నదేనని ఆయన తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన యూనిఫాంలు,పుస్తకాలు,ఇతర సామగ్రి అందించేవారని, నాసిరకం వస్తువులకు ఎలాంటి అవకాశం ఉండేదికాదని అన్నారు.ప్రస్తుతం కూడా గురుకుల విద్యార్థులందరికీ నాణ్యమైన వస్తువులు పారదర్శకంగా అందాలని, వారి భవిష్యత్తుతో ఎవరూ రాజీ పడకూడదన్నదే బీఆర్ఎస్ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తెలిపారు.

తన భద్రత తొలగింపు పై....

రాష్ట్ర ప్రభుత్వం తన భద్రతను తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తానేమీ రాజకీయ లబ్ధి కోసం వచ్చిన వ్యక్తిని కాదని, 26 ఏండ్లు ఐపీఎస్ అధికారిగా దేశం కోసం ప్రాణాలు పణంగాపెట్టి పనిచేశానని, తనకు రాష్ట్రపతి శౌర్యపతకం కూడా వచ్చిందని గుర్తుచేశారు. తాను కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ హయాంలో ఆఫీసర్గా పనిచేశానని, ఏ ప్రభుత్వం కూడా తన భద్రతను తగ్గించలేదు కానీ, ఇప్పుడు కక్షపూరితంగా తన భద్రతను తగ్గించారని మండిపడ్డారు...నిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రభుత్వాన్ని ఎండగడుతున్నందుకే తనపై కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధిస్తున్నదని ఆరోపించారు. తాను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే తన వ్యక్తిగత భద్రతను కుదించిందని మండిపడ్డారు. తన సెక్యూరిటీని తొలగించినా, తనను బెదిరించినా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపబోనని, ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ను వీడనని స్పష్టంచేశారు.....తన ప్రాణాలకు రేవంత్రెడ్డిదే బాధ్యతని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి,నాగర దొడ్డి వెంకట్రాములు, జి.రాఘవేంద్ర రెడ్డి, అంగడి బసవరాజ్, ఆతుకూరి రెహమాన్,కౌన్సిలర్ చంటన్న, కురవ పల్లయ్య,చిన్నపాడు ఆంజనేయులు,మోనేష్, గంజిపేట రాజు,చక్రిధర్ రెడ్డి,ఆటో టవర్ ముక్బాల్,తిమ్మప్ప గౌడ్,వెంకటేష్ నాయుడు, నూర్ పాషా, శ్రీరాములు, ముని మౌర్య,ఇద్దుం గోవిందు,కావాలి గోపి,గాజుల కృష్ణారెడ్డి,డ్యామ్ శ్రీను, సామెలు,ఇంజన్న,మాలిక్,రాము, రమేష్,తిమ్మప్ప,కృష్ణ,మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఒకే వేదికపై ఎమ్మెల్యే, చైర్మన్ ఒకరినొకరు దూషించుకున్న వైనం

**- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు నిర్మలా జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్: - "తప్పుకుంటూ పోతే మీ పాత చిట్టా బయటపెడతాం!**

**-సంగారెడ్డిలో ఒకే వేదిక పై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పొలిటికల్ పంచ్ డైలాగులు.**

**-గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూనే... కాంగ్రెస్ పథకాలు అమలు చేస్తున్నాం!**

**-ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టబోయిన ఎమ్మెల్యేకు చుక్కలు చూపించిన నిర్మలమ్మ!**

**- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ప్రజలకు కాంగ్రెస్ అండ: నిర్మలా జగ్గారెడ్డి స్పష్టీకరణ!**



సంగారెడ్డి ప్రతినిధి జూన్ 29( ప్రజా కలం):

సంగారెడ్డి నియోజకవర్గంలో టీజీఐఐసీ టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తనదైన శైలిలో పొలిటికల్ హీట్ పెంచారు. పోతిరెడ్డిపల్లిలో జరిగిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు నిర్మలా జగ్గారెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. అప్పుల చిట్టాను బయటపెట్టిన నిర్మల:కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తులం బంగారం, మహాలక్ష్మి పథకం ఎప్పుడు ఇస్తారంటూ కాంగ్రెస్ హామీలను ప్రశ్నించారు. దీనిపై ఏమాత్రం తగ్గకుండా నిర్మలా జగ్గారెడ్డి అంతే వేగంగా రియాక్ట్ అయ్యారు.

"గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అపారమైన అప్పులను తీర్చడానికే మాకు ప్రస్తుతం సమయం పడుతోంది" అంటూ గత పాలకుల ఆర్థిక వైఫల్యాలను ఆమె నేరుగా ఎండగట్టారు.పథకాల అమలుపై ధీమా:రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా ఒక్కొక్కటిగా పథకాలను అమలు చేస్తూ ప్రజలకు విరివిగా చేయూతనిస్తోందని నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఎమ్మెల్యేకు వేదికపైనే స్ట్రాంగ్ కౌంటర్:

చివరగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను ఉద్దేశించి నిర్మలమ్మ వేసిన పొలిటికల్ పంచ్ సభలో కాకరేపింది. "ఇలా హామీల గురించి మీరు తవ్వుకుంటూ పోతే.. గత పదేళ్ల మీ పాలనలో ఇచ్చిన మోసపూరిత హామీలను మేము కూడా తవ్వాల్సి వస్తుంది.. జాగ్రత్త!" అంటూ నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం చేశారు. దీంతో వేదికపై విమర్శలు చేద్దామనుకున్న ఎమ్మెల్యేకు నిర్మలా జగ్గారెడ్డి దెబ్బకు గట్టి సమాధానం లభించినట్లయింది.



# మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

## రెండు లక్షల నియామకాలు ఎక్కడని కవిత ప్రశ్న
## నిరుద్యోగులతో కలిసి దిల్ సుఖ్ నగర్ లో ధర్నా



హైదరాబాద్, జూన్ 29 (ప్రజా కలం ప్రతినిధి)

నిరుద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం బాగుపడలేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. దిల్ సుఖ్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు నిరుద్యోగులు వదిలిపెట్టరని హెచ్చరించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని, 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తాము నిరుద్యోగుల వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నారని, ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. ఒక జప్పా ప్రభుత్వం అని తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి, డీజీపీ సైతం 19 వేలకు పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు ఉన్నాయని చెప్పి, ఇప్పుడు కేవలం 5 వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరు ద్యోగులను వంచించడమేనన్నారు. మాట మార్చి,మతి తప్పి వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చే వరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ట్రైనింగ్ ఇచ్చే పరిస్థితి లేదంటూ ప్రభుత్వం సాకులు చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక కానిస్టేబుల్ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించుకున్నామని, ఇప్పుడు ఎంతో మంది ఆడబిడ్డలు ఇళ్లు వదిలి ఇక్కడికి వచ్చి శిక్షణ తీసుకుంటున్నారని కవిత పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి కూడా ఒక బిడ్డ ఉందని, ఈ ఆడబిడ్డల సమస్యలపై ఆయన ఆలోచించాలన్నారు.




గతంలో ఏజ్ రిలాక్సేషన్ ఇస్తూ జీవో 31 తెచ్చి, ఇప్పుడు దాన్ని మార్చడం వెనుక నిరుద్యోగులను మోసం చేసే కుట్ర దాగి ఉందన్నారు. కానిస్టేబుల్స్‌కు 36 ఏళ్లు, ఎస్సై ఉద్యోగాలకు 38 ఏళ్ల వరకు వయోపరిమితి సడలింపు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

రెండు లక్షల ఉద్యోగాలు

రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కేవలం 11 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు.ఎవరు అడ్డువచ్చినా తొక్కుకుంటూ 7 వేల కోట్లతో మూసీ ప్రాజెక్ట్ చేస్తానంటున్న ముఖ్యమంత్రిని..అసలు ఆ ప్రాజెక్ట్ చేయమని ఎవరు అడిగారని ప్రశ్నించారు. పేదవాళ్ల ఇళ్లను కూలదోస్తూ మూసీ ప్రాజెక్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. జులై 2 నాడు నిరుద్యోగులు చేపట్టబోయే సచివాలయం ముట్టడికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, అదే రోజు తాము చేపట్టే భూపోరాట ఉద్యమకారులతో కలిసి నిరుద్యోగుల పక్షాన నిలబడతామని కవిత స్పష్టం చేశారు.

# శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక....



మల్కాజిగిరి జూన్29 (ప్రజా కలం ప్రతినిధి)

నూతన అధ్యక్షులు గా జె. సుధాకర్ ప్రధాన కార్యదర్శిగా అఖిల్ కాలనీ అభివృద్ధితో పాటు, మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని నూతన అధ్యక్షులు జె సుధాకర్ అన్నారు. కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ అసోసియేషన్ కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన అధ్యక్షులుగా జె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా, ట్రెజరర్ గా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బండ కృష్ణ, శ్రీనివాస్ గౌడ్,ప్రవీణ్ చారి,సహాయ కార్యదర్శులుగా మునీర్, మల్లేష్, రవి నాయక్, అడ్వైజర్లుగా బరత్ సాగర్, రాజయ్య, కనకయ్య, పరమేష్, కమిటీ సభ్యులుగా సురేష్ సాగర్, కూర అరుణ్, మాదేశ్, సమల కృష్ణ, రాజేష్, ప్రసాద్, శ్రవణ్, దామోదర్, శ్రీధర్, శివ కృష్ణ, రాంచందర్, సంతోష్, కిరణ్, శ్రీనివాసులు, ప్రవీణ్, హరి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మం లో స్థానిక కాలనీ సభ్యులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొని నూతన కమిటీ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

## - అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం.

రాజన్న సిరిసిల్ల, జూన్ 29 ( ప్రజా కలం ప్రతినిధి ): ప్రజావాణిలో ప్రజలు అందజేసే ప్రతి అర్జీని నిర్దేశిత గడువులో పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం



నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 172 దరఖాస్తులు అందాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగించిన కలెక్టర్, ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

డివిజన్ స్థాయిలోనూ ప్రజావాణి

జిల్లా కేంద్రంతో పాటు సిరిసిల్ల, వేములవాడ డివిజన్‌లలో కూడా ప్రజావాణి నిర్వహించారు. సిరిసిల్ల డివిజన్‌లో 12 దరఖాస్తులు అందగా, వాటిని అధికారులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేములవాడ డివిజన్ ప్రజావాణిలో 9 దరఖాస్తులు అందగా, ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు అందజేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జెడ్పీ సీఈఓ వెంకట మాధవరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదులు స్వీకరణ

రాజన్న సిరిసిల్ల, జూన్ 29 ( ప్రజా కలం ప్రతినిధి ): ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఈసారి 26 ఫిర్యాదులు అందాయి. జిల్లా




పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో అదనపు ఎస్పీ చంద్రయ్య ఫోన్‌లో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా వేగంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడానికి గ్రీవెన్స్ డే మంచి వేదికగా నిలుస్తోందని, సాధ్యమైనంత త్వరగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు.

# ఢిల్లీలో ఏఐసీసీ ఎస్సీ విభాగం చైర్మన్‌తో కాంగ్రెస్ నేతల భేటీ

గజ్వేల్:29 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఎస్సీ విభాగం చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్‌ను గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తూముకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ మల్కగళ్ల కరుణాకర్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఎస్సీ వర్గాల సంక్షేమం, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు,భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై వారు చర్చించినట్లు తెలిపారు. అనంతరం రాజేంద్ర పాల్ గౌతమ్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు చురుకుగా వ్యవహరించాలని రాజేంద్ర పాల్ గౌతమ్ సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి,మోహన్, విఠల్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి,ఐలయ్య, లింగరావు, కనకరాములు,అశోక్, నర్సింలు,గజ్వేల్ టౌన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి,గజ్వేల్ కౌన్సిలర్లు ఉపేందర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కెసిఆర్ హయంలో పాఠశాలలు అభివృద్ధి చెందాయి

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

మెదక్ జూన్ 29(ప్రజాకలం ప్రతినిధి) కొల్చారం మండలంలోని కొల్చారం, అప్పాజిపల్లి, పోతంశెట్టిపల్లి, రాంపూర్, రంగంపేట గ్రామాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పర్యటించారు. నూతనంగా మంజూరైన ప్రభుత్వ ప్రీ ప్రైమరి పాఠశాలలను ఆమె ప్రారంభించారు. ప్రీ ప్రైమరి విద్యార్థులకు అక్షరభ్యాసం చేయిస్తూ అక్షరాలను రాయించారు. అనంతరం రంగంపేట గ్రామ జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో ప్రతిభ పురస్కారాల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని ప్రతిభ పుస్తకాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు సంవత్సరాలు పై బడిన పిల్లలకు అంగన్వాడి పాఠశాలలుండగా నాలుగు సంవత్సరాలు పై బడిన పిల్లల కొరకు ప్రీ ప్రైమరి పాఠశాలలను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో చదివించాలను




కునే తల్లిదండ్రులకు ఈ పాఠశాలలు ఉపయోగపడుతా యన్నారు.ప్రీ ప్రైమరీ పాఠశాలకు అధనపు గది సౌకర్యం కల్పించాలన్నారు. గతంలో కేసిఆర్ మన ఊరు మన బడి కార్యక్రమం క్రింద పాఠశాలల అవసరాలకు నిధులు కేటాయించారని ఆమె గుర్తు చేశారు. ఇప్పుడు ఉపాది హామి నిధుల నుంచి కొన్ని పాఠశాలలకు ప్రహారీ గోడ నిర్మాణానికి నిధులు ఇచ్చారన్నారు. సరిపోని పాఠశాలలకు సెకండ్ ఫేస్లో మరో పది లక్షలు ఇచ్చారన్నారు. గ్రామాలలో మహిళా సమాఖ్య భవనాలకు పది లక్షల నిధులు ఇచ్చారన్నారు. కెసిఆర్ హయంలో గ్రామాలు అభివృద్ధి చెందాయి అని వారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరిశంకర్, యూత్ అధ్యక్షులు సంతోష్ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి, సర్పంచులు, అరిగే స్వర్ణలత విజయ్, నిర్మల మల్లేశం, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సంతోష్ కుమార్, మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి,అరిగే రమేష్ కుమార్,కొమ్ముల యాదాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ధ్రువీకరణ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్.. ఐదుగురి అరెస్టు

## -- గ్రామపంచాయతీ కార్యదర్శి పేరుతో ఫోర్జరీ.. రిమాండ్‌కు తరలింపు.



వేములవాడ రూరల్ , జూన్ 29 ( ప్రజా కలం ప్రతినిధి ):

గ్రామపంచాయతీ కార్యదర్శి పేరుతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేయించిన ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాములు మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులు ఇంటి స్థలాన్ని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే సంబంధిత భూమి రాములు పేరిట రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడంతో గ్రామపంచాయతీ ధ్రువీకరణ పత్రం అవసరమని తెలిసింది. అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శి రమ నో-డ్యూస్ సర్టిఫికెట్ మాత్రమే జారీ చేసి, కోరిన ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వడానికి నిరాకరించినట్లు తెలిపారు. అనంతరం నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా ఈ ఏడాది ఏప్రిల్ 15న 969 గజాల స్థలాన్ని తాళ్లపల్లి సాగర్ పేరుపై గిఫ్ట్ డీడ్ ద్వారా, ఏప్రిల్ 22న మరో 968 గజాల స్థలాన్ని తాళ్లపల్లి లత పేరుపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంపై మాజీ గ్రామపంచాయతీ కార్యదర్శి రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా వేములవాడలోని భవానీనగర్‌లో అభినయ్ డాక్యుమెంట్ కార్యాలయం వద్ద తాళ్లపల్లి సాగర్, తాళ్లపల్లి లత, తాళ్లపల్లి చంద్రవ్వ, గుడిసె విష్ణువర్ధన్, మంద అభినయ్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, రిజిస్ట్రేషన్ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో సహకరించిన వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం, పోలీసు సిబ్బందిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా జగ్గయ్యగారి శేఖర్ నియామకం



గజ్వేల్:29 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు,నాచారం దేవస్థానం డైరెక్టర్, గజ్వేల్ అయ్యప్ప దేవాలయం ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్ కు మరో రాష్ట్ర స్థాయి పదవి వరించింది ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ రాష్ట్ర ఉపాధ్యకులు గా నియామక పత్రం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి చేతుల మీదుగా అందజేశరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యగారి శేఖర్ రాజకీయాల్లో రాణిస్తూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని,ఆర్యవైశ్య మహాసభ ద్వారా అలాగే వాసవి క్లబ్ ద్వారా విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారిని గుర్తించి, ఆర్యవైశ్య మహాసభ అధినాయకత్వం , ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా నియమించడం జరిగిందని వారికి అభినందనలు తెలిపారు,అనంతరం జగ్గయ్యగారి శేఖర్ మాట్లాడుతూ అందరికీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అనుగ్రహం ఉండాలని కోరుకుంటూ,నా మీద నమ్మకంతో రాజకీయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ గా పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ చైర్మన్ ఆగిరి వెంకటేష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు




గంప శ్రీనివాస్ మహాసభ కార్యవర్గ సభ్యులు ఐతరత్నాకర్ జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు జిల్లా సెక్రెటరీ సముద్రాల హరినాథ్ జిల్లా మాజీ అధ్యక్షులు కాసం నవీన్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ది బిక్షపతి,మర్యాల శ్రీనివాస్,మల్యాల భద్రయ్య, కొండపాక శ్రీనివాస్,కాశీనాథ్, సిరిపురం సత్యనారాయణ, బుస్స సిద్దేశ్వర్ నితీష్,కైలాస ప్రశాంత్,ఉమేష్, ఉప్పల చంద్ర శేఖర్, రామారం రమేష్, గందే సంతోష్,తదితరులు పాల్గొన్నారు

# బీడీఎల్ కాలనీకి ప్రహరీ గోడ.. అక్రమాలకు చెక్..

పటాన్‌చెరు, జూన్ 29 (ప్రజా కలం) ప్రతినిధి

భారతి నగర్ డివిజన్ బీడీఎల్ కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికుల ఫిర్యాదులను స్వయంగా తెలుసుకుని, పోలీసు శాఖతో పాటు సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి బీడీఎల్ కాలనీ నుంచి రాయసంద్రం చెరువు వరకు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఇంజినీరింగ్ సహాయ ఇంజినీర్ శివతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించారు. రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవించి కాలనీలోకి వచ్చి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని నివాసితులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆదర్శ్ రెడ్డి, ముఖ్యంగా వారాంతాల్లో పోలీసులు తరచూ



గస్తీ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్‌ను కోరారు. అలాగే ప్రజల రాకపోకలను నియంత్రిస్తూ అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత ప్రాంతంలో ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ సహాయ ఇంజినీర్ శివకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ కాలనీ సొసైటీ డైరెక్టర్లు రమేష్, విఠల్ రెడ్డి, పాషా, మహిళలు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు..

# భూ తగాదా కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్.

## దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్.

సిద్దిపేట జూన్ 29 ప్రజాకలం :

సిద్దిపేట జిల్లా అహ్మద్‌నగర్ గ్రామంలో ఈ నెల 22న జరిగిన భూ



తగాదా ఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. షేక్ యూసఫ్ కుటుంబానికి, షేక్ మస్తాన్ కుటుంబానికి మధ్య భూ వివాదం నేపథ్యంలో జరిగిన గొడవలో షేక్ యూసఫ్, ఆయన కుమారుడు గాయపడగా, బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులైన షేక్ మస్తాన్, షేక్ సాదిక్, షేక్ సల్మాన్, షేక్ అబ్బాస్, షేక్ జకీర్‌లను సోమవారం అరెస్ట్ చేసి, అనంతరం న్యాయస్థానంలో వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## తెలంగాణ రాష్ట్ర రక్షణ సేనను బలోపేతం చేస్తాం: నరసింహులు

గజ్వేల్: 29 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన (టీఆర్ఎస్)ను గజ్వేల్‌లో క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని ఆ పార్టీ గజ్వేల్ నాయకుడు,మాజీ ఎంపీటీసీ నరసింహులు అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని, ఈ నేపథ్యంలో కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు



ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి నాయకత్వంలో పేదలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి,వారి హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని నరసింహులు స్పష్టం చేశారు. గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చుట్టూ నిర్మాణంలో ఉన్న రింగ్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు వారం రోజుల్లో రింగ్ రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా,నెలలు గడిచినా పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అదేవిధంగా,ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# భరత్ చంద్ర స్కూల్ ఘటన

## ఆర్మూరులో ఆంక్షలు విధించిన పోలీస్ కమిషనర్




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 29: ఆర్మూరు పట్టణంలోని భరత్ చంద్ర స్కూలులో జరిగిన ఘటన నేపథ్యంలో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య కఠిన నిర్ణయం తీసుకున్నారు. పట్టణంలో రేపటి వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (గతంలో సెక్షన్ 144) అమలులో ఉంటుందని ఆయన ప్రకటించారు. స్కూలు ఘటన తర్వాత పట్టణంలో బంద్ కాల్, ధర్నాలు, ర్యాలీలు మరియు రాస్తారోకోల వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఈ ఆంక్షలు విధించారు. సోమవారం (జూన్ 29) ఉదయం 6 గంటల నుండి మంగళవారం (జూన్ 30) సాయంత్రం 5 గంటల వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయి. ఈ సమయం వరకు ఎవరూ గుంపులుగా చేరకూడదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. పట్టణంలోని అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచామని, శాంతి భద్రతలను కాపాడటంలో ప్రజలందరూ సహకరించాలని పోలీసు అధికారులు కోరుతున్నారు. ఆర్మూరులో అదనపు బలగాలతో నిరంతరం పహారా కాస్తున్నట్లు సమాచారం.




# కోలా రవీందర్ ముదిరాజ్ కు సేవ శిరోమణి అవార్డు అందజేత

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సామాజిక వేత్త కోలా రవీందర్ ముదిరాజ్ కు సూర్యచంద్ర కల్చర్ ఆర్గనైజర్ వారు సేవ శిరోమణి అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్, ప్రముఖ పారిశ్రామికవేత్త చల్ల రాజశేఖర్ రెడ్డి ప్రముఖ జ్యోతిష్యులు భాగ్యలక్ష్మి రెడ్డి, రిటైర్డ్ సీఐ ఎక్సైజ్ ఎండి హమీద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తూ అనుభవమున్న పనిని ఎన్నుకొని ముందుకు సాగాలని న్యాయాన్ని గౌరవిస్తూ యువత ముందుకు సాగాలని సాయి శక్తుల ఇతరులకు సహాయ పడాలన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చెల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... యువత మంచి చదువులు చదువుకొని టెక్నికల్ విద్య నేర్వాలని ప్రతి మందికి ఉపాధి కల్పించే ఆలోచన ఉండాలన్నారు. యోగా ఒక దినచర్యగా పాటించాలని యోగ వల్ల సర్వరోగ నివారిణి అవుతుందని యోగా నిపుణులు కొనియాడుతూ యోగ చేస్తున్న విద్యార్థులను సన్మానించారు. ఎండి హమీద్ రిటైర్డ్ ఎక్సైజ్ సిఐ, ప్రముఖ జ్యోతిష్కురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... రవీందర్ చేస్తున్న సామాజిక సేవను గుర్తు చేసుకుంటూ ప్లాస్టిక్ పై నిరంతరం పోరాడుతూ ప్రతి పాఠశాలకు వెళ్లి ఈత ఒక సాధన అని పిల్లలకు అవగాహన కల్పిస్తూ నీటిని పొదుపుగా వాడాలని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలని అవగాహన కల్పిస్తున్న రవీందర్ ముదిరాజ్ ని సేవ శిరోమణి అవార్డు అందించి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ...నాకు బాధ్యత పెరిగిందని ముందు ముందు సమాజ సేవకు కొద్ది సమయం కేటాయిస్తానని అందరి సహకారం ఉంటే ఏ పనైనా సాధించవచ్చని ప్రతి మనిషికి పట్టుదల కసి ఉండాలని రవీందర్ ముదిరాజ్ అన్నారు.

## బోడుప్పల్ దేవెందర్ నగర్ దాడి ఘటనలో

# 13 మంది నిందితుల అరెస్ట్

### మిగతావారిని త్వరలో అరెస్ట్ చేస్తాం..



మేడిపల్లి జూన్ 29(ప్రజాకలం న్యూస్)

బోడుప్పల్ దేవెందర్ నగర్ కాలనీలో ఆదివారం రాత్రి విచక్షణారహిత దాడి ఘటనలో 13మంది నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మేడిపల్లి పోలీసుల తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ లోని దేవేందర్ నగర్ కాలనీలో జూన్ 27 రాత్రి 8 గంటల సమయంలో అనూప్ కుమార్ నూతనంగా నిర్మించిన తన ఇంటి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా గతంలో జరిగిన చిన్న గొడవను దృష్టిలో పెట్టుకొని దాదాపు 30 మంది యువకులు ద్విచక్ర వాహనాలపై వచ్చి కర్రలు,హాకీ స్టిక్ తో అనూప్ కుమార్ వారి కుటుంబ సభ్యులు,బంధువుల పై విచక్షణా రహితంగా దాడియడమే కాకుండా ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు 4 కార్లు,3 బైకులు,ధ్వంసం చేసి పరారయ్యారు.

మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

తన కళ్ళ ముందు జరుగుతున్న దాడి ఘటనను సమీపంలో నివసిస్తున్న జర్నలిస్టు విష్ణుగౌడ్ తన మొబైల్ ఫోన్లో చిత్రీకరిస్తుండగా ఆయనపై దాడి చేసి కారును ధ్వంసం చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ దాడికి సంబంధించి మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో 935,937/2026 రెండు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. జూన్ 28 రాత్రి 13మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

అరెస్ట్ అయిన నిందితుల్లో వాసవి సాయికుమార్ (33) పులి ప్రదీప్ కుమార్ (32)కెమిటి రామకృష్ణ (23) కొమ్ము వేణు (21) ఆరుట్ల సుశాంత్ రెడ్డి (25) తాటికాయల విష్ణు (23) కుంకుడు పాముల ఉదయ్ కుమార్ (22) మహమ్మద్ అక్తర్ (25) మేడికొండ సంతోష్ కుమార్ (24)కదురు సాయి తేజ (21) ఆకునూరి అరుణ్ (20)తొండ మహేష్ (32) వసురి యాకయ(60)ఈ దాడిలో పాల్గొన్న మిగతా నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తానని మేడిపల్లి ఇన్స్పెక్టర్ జలంధర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు



సిద్దిపేట:29 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి,సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాలు, కాలనీలు, ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు తదితర ప్రాంతాలను సందర్శించి అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పిల్లల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, ఆదివారం డ్రాప్స్ వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు అందజేశారు. అలాగే తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ,పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని వివరించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శ్రీవాణి మాట్లాడుతూ, "ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు సహకరించాలి. ఏదైనా కారణంతో డ్రాప్స్ మిస్ అయిన చిన్నారులను వెంటనే గుర్తించి వారికి పోలియో చుక్కలు వేస్తున్నాం" అని తెలిపారు.

# హైదరాబాద్ హీరోస్‌కు రగ్బీ ప్రీమియర్ లీగ్ టైటిల్

## ముంబైపై 41-17తో ఘన విజయం




హైదరాబాద్, జూన్ 29 (ప్రజా కలం ప్రతినిధి)

రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్–2 విజేతగా హైదరాబాద్ హీరోస్ జట్టు అవతరించింది. గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై డ్రీమర్స్‌పై 41–17 స్కోరుతో ఘన విజయం సాధించి తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆరంభంలో ముంబై డ్రీమర్స్ బంతిపై ఆధిపత్యం చెలాయించినప్పటికీ, హైదరాబాద్ హీరోస్ కట్టుదిట్టమైన రక్షణతో ప్రత్యర్థిని కట్టడి చేసింది. ప్రత్యర్థి చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకుంటూ వేగవంతమైన కౌంటర్ అటాక్‌లతో వరుసగా పాయింట్లు సాధించింది. ఫ్రాన్సిస్కో కాస్కుల్లుయేలా కీలక టర్నోవర్ సాధించగా, తైతైఫానో తావితా, శివమ్ శుక్లా ట్రైలు నమోదు చేశారు.

అనంతరం మారిస్ లాంగ్‌బాటమ్ డ్రాప్ గోల్‌తో విరామ సమయానికి హీరోస్ ఆధిక్యంలో నిలిచింది. రెండోఅర్ధంలోనూ హైదరాబాద్ జట్టు అదే జోరు కొనసాగించింది. తావితా అందించిన అద్భుత అవకాశాన్ని డియాగో అర్డావో ట్రైగా మలిచాడు. ముంబై తరఫున ఇతన్ మెక్‌ఫర్లాండ్ తొలి ట్రై సాధించినా, హైదరాబాద్ వెనుకడుగు వేయలేదు. అర్డావో మరో ట్రై చేయగా, కెవిన్ వెకేసా, తేరియో తమని కూడా స్కోర్లు నమోదు చేసి జట్టు ఆధిక్యాన్ని మరింత పెంచారు. చివర్లో జేమ్స్ టర్నర్, సుకుమార్ హెంబ్రోమ్ ట్రైలు చేసినప్పటికీ ముంబై ఓటమిని తప్పించుకోలేకపోయింది.

కెప్టెన్ ఆనందం

విజయం అనంతరం హైదరాబాద్ హీరోస్ కెప్టెన్ మాన్యుయెల్ మొరెనో మాట్లాడుతూ, "టోర్నమెంట్ అంతటా మా ఆటగాళ్లు అసాధారణ ప్రదర్శన చేశారు. కష్టానికి తగిన ఫలితం దక్కింది. టైటిల్ గెలవాలన్న లక్ష్యంతోనే బరిలోకి దిగాం. మూడు వారాల వ్యవధిలో ఏర్పడిన జట్టు ఇంతటి స్థాయిలో ఆడటం గర్వకారణం" అని అన్నారు.

ప్రముఖుల సమక్షంలో ముగింపు

రగ్బీ ఇండియాతో కలిసి జీఎంఆర్ స్పోర్ట్స్ నిర్వహించిన ఈ లీగ్ ముగింపు వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి, ప్రపంచ చాంపియన్ పి.వి. సింధు, సినీ నటి మృణాల్ ఠాకూర్, జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రాంధి, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చైర్మన్ జి.బి.ఎస్. రాజు, రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్ తదితరులు హాజరయ్యారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా మార్కెట్ కమిటీ కీలక నిర్ణయాలు.

## గోదాం నిర్మాణానికి ఆమోదం -- మార్కెట్ భూముల సర్వే, ఆక్రమణల తొలగింపునకు తీర్మానం.



సిద్దిపేట జూన్ 29 (ప్రజాకలం)

రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆస్తులను పరిరక్షించడం లక్ష్యంగా దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సోమవారం చైర్మన్ ఐలపురం కనకయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు.

రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఆధునిక గోదాం నిర్మాణానికి సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో ధాన్యం వర్షాలు, ఇతర ప్రకృతి పరిస్థితుల వల్ల నష్టపోకుండా ఉండటంతో పాటు రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు అందనున్నాయి. దౌల్తాబాద్, దీపాయంపల్లి, ముబారస్పూర్ గ్రామాల్లో మార్కెట్ కమిటీకి చెందిన భూములను సర్వే చేయించి, ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించాలని నిర్ణయించారు. ఆక్రమణలను తొలగించి భూములను తిరిగి కమిటీ ఆధీనంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

మార్కెట్ కమిటీ ఆదాయ వనరుల పెంపు, రైతులకు మౌలిక సదుపాయాల అభివృద్ధి, మార్కెట్ సేవల మెరుగుదలపై కూడా సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా చైర్మన్ ఐలపురం కనకయ్య యాదవ్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే మార్కెట్ కమిటీ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీకి చెందిన ప్రతి అంగుళం భూమిని పరిరక్షించి ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ మద్దెల స్వామి, కార్యదర్శి సుగ్రీవ్, స్థానిక సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు.



సిద్దిపేట జూన్ 29 ప్రజాకలం:

పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు అందించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాలు, కాలనీలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తదితర ప్రాంతాలను సందర్శించి అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, ఆదివారం డ్రాప్స్ వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి వెంటనే పోలియో చుక్కలు అందించారు.

ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పోలియో నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ, పిల్లల ఆరోగ్య రక్షణలో ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని వివరించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శ్రీవాణి మాట్లాడుతూ, "ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలి. ఏదైనా కారణంతో పోలియో డ్రాప్స్ మిస్ అయిన చిన్నారులను వెంటనే గుర్తించి వారికి పోలియో చుక్కలు వేస్తున్నాం. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అందరి బాధ్యత" అని తెలిపారు.

## జేసీహెచ్ఎస్ఎల్ అధ్యక్షుడిపై కేసు

హైదరాబాద్, జూన్ 29 (ప్రజా కలం ప్రతినిధి)

జూబ్లీహిల్స్ జర్నలిస్టుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (JCHSL) అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజుపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



పోలీసుల వివరాల ప్రకారం.. సొసైటీ ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నించినందుకు తనను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారని సొసైటీ కోశాధికారి భీమగాని మహేశ్వర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రైవర్ గోపాల్‌తో కలిసి పలుమార్లు బెదిరించారని, గుర్తు తెలియని వ్యక్తులను సొసైటీ కార్యాలయానికి తీసుకొచ్చి భయాందోళనలకు గురిచేస్తున్నారని కూడా ఆరోపించారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం కోర్టు అనుమతితో జూబ్లీహిల్స్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలి

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా.!

### విద్యార్థి నాయకుల అరెస్ట్

హైద్రాబాద్ జూన్ 29(ప్రజాకలం న్యూస్)

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడి అరికట్టి బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ యాజమాన్య కోట సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్న కళాశాలలను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని, విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు పుట్ట లక్ష్మణ్ ని అరెస్ట్ చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు.




## దశాబ్దకాల డ్రైనేజీ సమస్యకు ఒక్క రోజులో చెక్..!

### - కౌన్సిలర్ల విజ్ఞప్తితో 24 గంటల్లో సమస్యకు పరిష్కారం.



వేములవాడ జూన్ 29 (ప్రజా కలం ప్రతినిధి),: ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం, స్పందన, సమన్వయం ఉంటే ఫలితాలు ఎలా ఉంటాయో వేములవాడ మున్సిపల్ యంత్రాంగం మరోసారి నిరూపించింది. తిప్పాపూర్ ఏరియా ఆస్పత్రి ఎదుట దశాబ్దకాలంగా పేరుకుపోయిన డ్రైనేజీ సమస్యపై స్థానికులు చేసిన ఫిర్యాదుకు కేవలం 24 గంటల్లోనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని విలీనమైన తిప్పాపూర్ ఏరియా ఆస్పత్రి ముందు డ్రైనేజీల్లో దశాబ్దకాలంగా చెత్త, మట్టి, వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని స్థానిక కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఆదివారం స్వయంగా ఘటనాస్థలికి చేరుకున్న చైర్మన్ పరిస్థితిని పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించి జేసీబీ సహాయంతో దాదాపు పది సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్త, మట్టి, వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను తొలగించి డ్రైనేజీ వ్యవస్థను సాధారణ స్థితికి తీసుకొచ్చారు,ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని వెంటనే పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. తిప్పాపూర్ 7, 8వ వార్డుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామని, స్థానిక కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్,మైలారం శ్రీనివాస్ లు ప్రజల మధ్య ఉంటూ సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావడం వల్ల అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. డ్రైనేజీలు, రోడ్లు, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వబోమని స్పష్టం చేశారు. తాత్కాలిక చర్యలతో కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. దశాబ్దకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న తిప్పాపూర్ లోని డ్రైనేజీ సమస్య ఒక్కరోజులోనే తొలగిపోవడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు, ఆస్పత్రికి వచ్చే రోగులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు ఎల శ్రీనివాన్, మైలారం శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్న మున్సిపల్ యంత్రాంగం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కాంగ్రెస్ నాయకులు కాసారపు తిరుపతి,వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.



## పేద విద్యార్థులకు చేరువైన విద్య

### మూసివేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

కంటోన్మెంట్: జూన్29:ప్రజాకలం ప్రతినిధి

తిరుమలగిరి మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నాగదేవత టెంపుల్ ఈ విద్యా సంవత్సరంలో తిరిగి పునఃప్రారంభించబడిందాని, తిరుమలగిరి మండల డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ విక్రమాదిత్య తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల పునఃప్రారంభం చేయడం జరిగిందని, తదనంతరం విద్యార్థులకు బుక్స్, టెక్ట్స్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య మాట్లాడుతూ... గతంలో విద్యార్థుల నమోదు లేకపోవడంతో సుమారు మూడు సంవత్సరాల క్రితం మూసివేయబడిన ఈ పాఠశాలను, బడిబాట కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక చర్యలు తీసుకుని ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి తిరిగి ప్రారంభించారు. పాఠశాల పునఃప్రారంభం అనంతరం విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుండగా, ఇప్పటికే పదికి పైగా నూతన విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రవేశాలు నమోదవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను వారి నివాస ప్రాంతానికే చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను పునఃప్రారంభించాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటూ, వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ పునఃప్రారంభం ద్వారా ఆ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







## ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి దున్ని విత్తనాలు చల్లిన మంత్రి పొన్నం ప్రభాకర్.

### కూరెల్లలో వ్యవసాయ పనులకు శ్రీకారం

### - రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు.

సిద్దిపేట జూన్ 29 ప్రజాకలం.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం కోహెడ మండలంలోని కూరెళ్ల గ్రామంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగలి దున్ని, విత్తనాలు చల్లి వ్యవసాయ పనులకు ప్రతీకాత్మకంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఏరువాక పౌర్ణమి తెలంగాణలో వ్యవసాయ ప్రారంభ దినంగా భావిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని భూమాతను ప్రార్థిస్తూ కూరెళ్ల గ్రామంలో వ్యవసాయ కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సరైన పంటల ఎంపికతో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దేశానికే వెన్నెముకైన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



## కేసీఆర్ హయాంలో నిధులు...

### రేవంత్ పాలనలో బూతులు-మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధ్వజం

హైదరాబాద్, జూన్ 29 (ప్రజా కలం ప్రతినిధి)

నల్లగొండలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖాళీ కుర్చీల ముందట సంస్కారహీనంగా మాట్లాడారని మాజీ మంత్రి జి. జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నల్లగొండకు నిధుల వరద వస్తే, రేవంత్ పాలనలో బూతుల కంపు వస్తుందని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. నల్లగొండ సభ కోసం అధికారులు ప్రయాసపడటం, ప్రజాధనం వృధా చేయడం తప్ప జిల్లాకు రేవంత్ రెడ్డి తెచ్చింది ఏమీ లేదన్నారు. అధికారంలోకి వచ్చాక జిల్లాకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వకుండా, ఊరికే కేసీఆర్ మీద పడి ఏడవడం రేవంత్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ కేసీఆర్‌నే టార్గెట్ చేస్తున్నారని, కాంగ్రెస్–బీజేపీలు ఒకరినొకరు ఏమీ అనకుండా లోపాయికారీ ఒప్పందంతో నడుస్తున్నాయని ఆరోపించారు. 50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకుని, 50 వేల కోట్లు సంపాదించుకోవచ్చని రేవంత్ నిరూపించాడని, పాత కాంగ్రెస్ నేతలను తొక్కుకుంటూ వచ్చిన ఈ హైబ్రిడ్ కాంగ్రెస్‌ను చూసి ఆ పార్టీ కార్యకర్తలే బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు.

మూడు నిమిషాల్లో నల్లగొండకు కేసీఆర్ చేసిన 300 పనులు తాము చెప్పగలమని, రేవంత్ రెడ్డికి 300 గంటలు సమయం ఇచ్చినా తాను చేసిన ఒక్క పనిని కూడా చెప్పలేరని జగదీశ్ రెడ్డి సవాల్ విసిరారు. నాగార్జున సాగర్‌లో నీళ్లున్నా రైతులకు ఇవ్వకుండా చంద్రబాబుకు నీళ్లు దోచిపెడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టాలంటేనే సీఎం పారిపోతారని, అసెంబ్లీలో మాట్లాడిన దాంట్లో సగం సమయం ఇస్తే ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు. కేసీఆర్ మీద మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని, కాంగ్రెస్ నేతలే రేవంత్‌ను తొక్కడానికి సమయం కోసం చూస్తున్నారని హెచ్చరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, సీఎం పదవిలో ఉండి నేతల ఆకారాల గురించి బాడీ షేమింగ్ చేస్తూ మాట్లాడటం రేవంత్ రెడ్డి సంస్కారహీనతకు నిదర్శనమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జగదీశ్ రెడ్డి చేసిన అభివృద్ధి చరిత్రాత్మకమని, ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి, లిటిగేషన్ భూముల దందాలపైనే శ్రద్ధ పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 80 శాతం పూర్తయిన ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ..




రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో రూ.1,500 కోట్లతో కేసీఆర్ హయాంలో నల్లగొండను తాము అభివృద్ధి చేశామని, ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో తేల్చుకోవడానికి నల్లగొండ క్లాక్ టవర్ దగ్గర చర్చకు రావాలని కోమటిరెడ్డికి సవాల్ విసిరారు. కోమటిరెడ్డి తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేయలేదని, ఉత్తమ్‌కు పదవి ఇస్తారనే అసూయతోనే చేశారని ఆరోపించారు. ఆకారాల గురించి హేళన చేయడం మానుకుని, ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ పెట్టకపోతే ప్రజలు కాంగ్రెస్ నేతలను ఉరికించి కొడతారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మాట్లాడుతూ, నల్లగొండకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన బాలీవుడ్ విలన్ అమ్రిష్ పూరి, బాహుబలి కాలకేయుడిని తలపించిందని ఎద్దేవా చేశారు. విద్యుత్ మంత్రిగా జగదీశ్ రెడ్డి ఎన్నో విజయాలు సాధించారని, ఆయనను బాడీ షేమింగ్ చేసే హక్కు రేవంత్‌కు లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల జపం చేయడం తప్ప రేవంత్ రెడ్డికి ఏమీ చేతకాదని, జగదీశ్ రెడ్డి శంఖం పూరిస్తే నల్లగొండ కాంగ్రెస్ నేతలు పారిపోవడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కె. ప్రభాకర్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, గొంగిడి సునీత,బీఆర్ఎస్ నేతలు ఒంటెద్దు నరసింహ రెడ్డి, పల్లె రవికుమార్, రామచంద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com